
RSVM01A140 C

# గ్రంథాలయసర్వస్వము.

సచిత్ర మాసపత్రిక

సంపుటము ౧౧    ఈశ్వర - భాద్రపదము - సెప్టెంబరు ౧౯౩౭    సంచిక ౫



శ్రీ వేంకటేశ్వరవిలాస గ్రంథాలయము,
ఉపమాక - అగ్రహారము.

# ఉత్తమగ్రంథములకానుక

ఆంధ్రదేశగ్రంథాలయసంఘసభ్యులై, చందాలుచెల్లించిన గ్రంథాలయములవారికి మాత్రమే

**I. గీతాభూమిక**

౧౧౪పుటలు - స్టిఫ్ బైండు - మేలుకాగితము - అమూల్యగ్రంథము. శ్రీ అరవిందయోగీంద్రుని బంగాలి గ్రంథమునకు శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారి తెనుఁగుఅనువాదము. ఇది శ్రీ చల్లపల్లి రాజాగారి ఔదార్యమువలన లభించినది. పోస్టేజీ ఉచితము.

**II. కీ. శే. వల్లూరి సూర్యనారాయణరావు, బి. ఏ., బి. ఎల్. గారు ప్రకటించిన ఉత్తమగ్రంథములు.**

వీనినిగూర్చి సిఫార్సు చేసియుంటిమి. ఇవి కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ కళాశాలనుండి రావలెను. మాదగ్గరలేవు.

కార్యదర్శి,
ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ.

షరా:— "గీతాభూమిక :" భీమవరము - తణుకు - తాడేపల్లిగూడెము - రేపల్లె - తెనాలి - బెజవాడ - ధర్మవరము తాలూకాలలోని గ్రంథాలయములవారు ఆయాతాలూకా గ్రంథాలయసంఘముల నుండియు, బెజవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖపట్టణములలోని గ్రంథాలయములవారు ఆయా పట్టణగ్రంథాలయ సంఘముల నుండియు పై గ్రంథమును పొందగలుగుదురు.

---

# గ్రంథాలయ సర్వస్వము

## బెజవాడ.

చందా : ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల ౨౦-వ తేదీని వెలువడును.

వ్యాసములు:-గ్రంథాలయశాస్త్రము - ఆంధ్ర వాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘముల యొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు:—గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు, గ్రంథాలయ సేవకులయు, సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును. ఫోటోలుపంపువారు బ్లాకులఖర్చులు తామే భరింపవలెను. లేదా బ్లాకులుచేయించి పంపవలెను.

### హెచ్చరిక

ఈ పత్రిక ప్రతినెల ౨౦-వ తేదీని వెలువడును; కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రిక యందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల ౧-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

### ప్రకటనముల రేట్లు

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |

# ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము, బెజవాడ.

ది ౫-౯-౧౯౩౨ తేదిని పగలు 3 గంటలకు బెజవాడలో ఖద్దరుసంస్థానమువారి గాంధివిలాస భవనమున సామాన్యసంఘసభ కూడి, ఈక్రిందితీర్మానములు చేసెను:

౧. రాఁబోవు దసరాలో ఆంధ్రదేశగ్రంథాలయమహాసభ జరుపవలెను.

౨. ఆంధ్రదేశాభ్యుదయదాయకములగు ఉద్యమములకు సంబంధించినసభలను ఆంధ్రదేశగ్రంథాలయమహాసభతో పాటు చేసి, పరస్పర సహకారమును పెంపొందింపవలెను.

3. గ్రంథాలయశాస్త్రము, ఆంధ్రవాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయపునర్నిర్మాణము – వీనిని గూర్చిన వ్యాసములను వయోజనవిద్యను పెంపొందించుటకు గ్రంథాలయ సర్వస్వమునందు ఇదివరలోవలెనే ప్రకటించుటకు ఎట్టి అభ్యంతరమును లేదు.

౪. అఖిలభారతపరిశ్రమసంఘమువారు తమ 'బుల్లిటను' యొక్క అడ్వాన్సు కాపీని గ్రంథాలయసర్వస్వమునందు ప్రకటించుటకై ముందుగా పంపుటకు అంగీకరించినందులకై వారికి ఈసభవారు వందనము లర్పించుచున్నారు.

౫. శ్రీ దేశోద్ధారకులకు ఆరోగ్యమునీయవలసినదని భగవంతుని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

౬. (క) శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి శిలావిగ్రహమును ఆంధ్రవిశ్వవిద్యాలయమందు సుస్థిరమగు ఏర్పాటులపై నిర్మింపవలెనని యీ సంఘాధ్యక్షులు చేసినసూచనను ఈ సభవా రామోదించుచున్నారు.

(చ) శ్రీవారిపటమును ఉంచుటకై ఈసంఘమువారు ఆంధ్రదేశ గ్రంథాలయముల నన్నింటిని కోరుచున్నారు.

౭. (క) ఆంధ్రదేశమునందు గ్రంథాలయోద్యమముద్వారా వయోజనవిద్యను వ్యాపింపఁజేయుటకై ఈ సంఘమువారికి రు ౨౫,౦౦౦లు విరాళముగా నిప్పింపవలెనని మదాసు ప్రభుత్వమువారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

(చ) ఈ సంఘపక్షమున ప్రకటింపఁబడు "గ్రంథాలయసర్వస్వమును" ప్రభుత్వమువలనను – స్థానికసంస్థలవలనను నడుపఁబడుచున్న పాఠశాలలన్నియు తెప్పించులాగున ఉత్తరువు చేయవలెనని మదాసు ప్రభుత్వమువారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

(ట) ఈ తీర్మానములనుగూర్చి మదాసుప్రభుత్వమువారియొద్దకు రాయబారము పోవుటకు ఈ క్రిందివారిని ఇతరులను చేర్చుకొను అధికారముతో ఉపసంఘముగా ఏర్పాటు చేయుచున్నారు.

౧ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు, ౨ ఉప్పులూరి వేంకటకృష్ణయ్యగారు, 3 మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు, ౪ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, ౫ కల్లూరి సుబ్బారావుగారు, ౬ అయ్యంకి వేంకటరమణయ్యగారు.

౮. గుంటూరుమండలవైద్యశాలయందు గ్రంథాలయసేవ చేయుటకు గుంటూరుపట్టణగ్రంథాలయసంఘమువారి కోరికను అంగీకరింపవలసినదని మదాసుప్రభుత్వమువారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

౯. ప్రభుత్వమువారిచే ప్రకటింపఁబడు దేశభాషలలోనిప్రకటనములన్నియు ఆయాభాషాప్రాంతీయగ్రంథాలయముల కన్నింటికిని ఉచితముగా నిప్పింపవలెనని ఈ సభవారు మదాసుప్రభుత్వమువారిని ప్రార్థించుచున్నారు.

౧౦. ప్రభుత్వమువారిచే ప్రకటింపఁబడు ఆంధ్రాంగ్లేయభాషాప్రచురణములన్నియు ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునకును, ఆంధ్రదేశములోని జిల్లాతాలూకాపట్టణగ్రంథాలయసంఘములకును ఉచితముగా నిప్పింపవలెనని ఈ సభవారు మదాసుప్రభుత్వమువారిని ప్రార్థించుచున్నారు.

౧౧. మద్రాసురాష్ట్రమునఁగల తెలుఁగుజిల్లాలన్నిటిని కలిపి ప్రత్యేకాంధ్రరాష్ట్రముగ నిర్మాణము చేయుట అత్యవసరమని ఈసభవారు తీర్మానించుచు, అందులకువలయుఆందోళనము చేయవలెనని ఆంధ్రదేశస్థులను, ఆంధ్రశాసనసభ్యులను, ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుసంఘమువారిని, ఆంధ్రదేశమందలి స్థానికసంస్థలవారిని ఈసభవారు కోరుచున్నారు.

౧౨. దత్తమండలములని పిలువఁబడుచున్న కడప, కర్నూలు, బళ్ళారి, చిత్తూరు, అనంతపురము జిల్లాలలోని కళాశాలలను ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు వెంటనే చేర్పవలెనని, మదాసు ప్రభుత్వమువారిని, ఆంధ్రవిశ్వవిద్యాలయ సెనేటుసభ్యులను ఈసభవారు కోరుచున్నారు. అందులకువలయుఆందోళనము చేయవలెనని ఆంధ్రదేశస్థులను (రాయలసీమవాసులతో సహా), ఆంధ్రశాసనసభ్యులను ఈసభవారు కోరుచున్నారు.

మారేపల్లి రామచంద్రశాస్త్రి, అధ్యక్షుఁడు.

# విషయసూచిక


| విషయము | వ్యాసకర్త | పుట |
| --- | --- | --- |
| మేఘము ... ... | శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు | ౧౬౧ |
| బడ్జెట్టు అనగా నేమి? | ,, ,, | ౧౬౩ |
| భారతదేశము - ప్రభుత్వసైనిక పరిపాలనము | శ్రీ మఠం బాలసుబ్రహ్మణ్య గుప్తగారు | ౧౬౭ |
| శ్రీదుర్గాపూజ - పశుబలిదానము | శ్రీ పండిత మదనమోహన మాలవ్యగారు | ౧౭౩ |
| లాహోరు కంటోన్మెంటు రాకాసి కమేలా | శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు | ౧౭౫ |
| ద్వితీయ ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య మహాసభ | శ్రీ జోస్యభట్ల సత్యనారాయణగారు | ,, |
| అమ్మవారిపండుగ ... ... | శ్రీ దువ్వూరి అచ్యుతంగారు | ౧౭౬ |
| జీవకారుణ్య వృత్తాంతములు ... | ... ... | ౧౭౭ |
| ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య సంఘము | ... ... | ౧౭౮ |
| గ్రామోద్యోగ పత్రిక ... ... | ... ... | ౧౭౯ |
| నూనెగానుగ ... ... ... | శ్రీ జవేర్ భాయి, పి. పటేల్ గారు | ౧౮౦ |
| తెలకపిండి ... ... ... | ... ... | ౧౮౧ |
| గ్రంథవిమర్శనము ... ... | ... ... | ౧౮౨ |
| ఎన్నికలు ... ... ... | ... ... | ౧౮౩ |
| గ్రంథాలయవృత్తాంతములు ... | ... ... | ౧౮౪ |
| సంపాదకీయములు ... ... | ... ... | ౧౯౨ |
| నెలముచ్చటలు .. ... | ... ... | ౧౯౪ |

# గ్రంథాలయ సర్వస్వము

| సంపుటము ౧౧ | ఈశ్వర - భాద్రపదము - సెప్టెంబరు ౧౯౩౭ | సంచిక ౫ |
|---|---|---|

సంపాదకులు:
గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఎ.
మారేపల్లి రామచంద్రశాస్త్రి.
అయ్యంకి వేంకటరమణయ్య.


## మేఘము

దప్పిగొనినట్టి పుష్పతండంబు లలర
సంద్రములనుండి చల్లనిజలము దెత్తు
మిట్టమధ్యాహ్నమున సోలునట్టిపర్ణ
సమితికెల్లను శీతలచ్ఛాయ నిత్తు.

సూర్యరశ్మిని నాట్యంపు సొంపుజూపు
తల్లి జోకొట్ట నిద్రించు మొల్లగముల
నాదురెక్కల రాల్చెడు స్వాదుహైమ
బిందువులచే ప్రబోధించి పొందొనర్తు

రాల బోలెడు కరకముల్ రాల్చి గడుసు
పచ్చికబయళ్ళ వెల్లనౌ పగిదిచెనకి,
వర్షధారల వడగండ్ల వారిజేసి
గర్జనం బను నగవుచే కలక దీర్తు.

మంచుగడ్డలచే గొప్పమలల గప్పి
యందుగల మేడివృక్షంబు లణగి మూల్గ
రాత్రియెల్లను మారుతి చేతులందు
నిద్రజెందెద హిమముపై నెత్తి మోపి.

గుహుడు విద్యుత్తు నా వియద్గోపురముల
గరిమ నాసీనుడై యుండు; గర్జనంబు
క్రింద నొకకోన ఘోరమౌ బందెల బడి
తనుకులాడుచు దీర్ఘరోదనముచేయు.

పసిమికడలిని దిరుగాడు పసిడిబొమ్మ
గమికి నీడగు నచ్చరకన్నెలందు
ఉల్లము దగిల్చి యీగుహు డల్లనలన
నన్ను నడపెడు పుడమి సంద్రములమీద.

మిట్టపల్లంబు లనక రాల్గుట్ట లనక
నదులు చెరువులు నాక పెన్బొదలు నాక
యతని ప్రేమించు శక్తి తానతనికలల
ననుసరించుచు వసియించు నాడనాడ.

దానియనురాగవీచుల దగిలి యితడు
నీరధారల గురియుచు నిముసనిముస
మునకు దరుగుచునుండు నా ప్రొద్దదెల్ల
నాకసుని చిన్నినగవున నలరుచుండు.

ధరణి గంపింప నాడు గండశిలమీద
గగనపథముననుండి శీఘ్రముగ దిగుచు
పసిడిరెక్కలనీడన భరతు డొక్క
సూక్ష్మకాలంబు ప్రభుత కూర్చుండుపగిది.

వేగుచుక్క కన్మొరగుచు నేగు పిదప
కరమువెలిగెడు గొప్పపక్షముల విప్పి
పరచి, మిరుమిట్లు గొలుపు కన్మెరపుతోడ
భిన్నభిన్నత నొప్పు నా వెన్నుమీద.

నపుడ పొడసూపు నినుడు తా నధివసించు.

అలరువిలుకానికిని, దేహియలత దీర్పు
అలఘువిశ్రాంతికిని వేత్రహస్తు లనగ
నొప్పుసాంధ్య రాగములు మిన్గప్పితిమిర
జవనికలు పుడమిపై వడి జారువేళ,
పొదుగుపావురములు గూండ్ల నొదుగుపగిది
గగనగృహముల నెమ్మది గందు కూర్కి.

ధరణి జగములజేత చంద్రిమ యనంగ
నెన్నబడియెడు నాచిన్నివన్నెకన్నె
శ్వేతతేజంబుతో నిండి చెలగుముగుద
పవనశాబకములు రేయి పరపు సీన
హంసతూలిక బోలు నాయంగముపయి
తళుకు పచరించి యల్లన తరలిపోవు
విబుధవరులకు మాత్రంబ వినగ నయిన
యాకె గుప్త మౌపదముల తాకు కతన
నెచ్చొటెల్లను నాపల్చపచ్చడమున
ద్వార మేర్పడు నచ్చట తార లంతి
పొంచుచూపుల డాగురుమూతలాడు.

కనకభృంగసమూహంబు ననుకరించి
చిత్రభంగిని భ్రమణముల్ చేయువీని
నగు తెరంగున నావసనంబులోని
విందుసందుల వైశాల్య మంద జేతు.

శాంతిమైనుండు నదులు కాసారములును
సంద్రములుగూడ, నానుండి జారిపడిన
గగనశకలంబులో నాగ, తొగలరేని
వీనితో జేర్చి ప్రతిబింబ మీనునపుడు.

బుద్ధి యేపూట బుట్టు నాపూటయంద
సూర్యసింహాసనము నేను సుప్రకాశ
శృంఖలముచేత బంధింతు; శీతకరుని
గద్దియను ముత్యపుసరుల గట్టివైతు.

కమ్మతెమ్మెరల్ నాపతాకంబు విప్ప
నగ్నిపర్వతముల్ జడత నందుచుండు
జుక్కలెల్లయు నబ్రింపుసోయగమున
నీదిపరతెంచు; నేనును భూధరములు
గట్టికంబములై నిల్వ గప్పువోలి
యునునిదీప్తికి రవ్వంత యెడము నీక,
యగ్రిమందుండి మరియొక్కయగ్రిమునకు
వ్యాపనంబంది ఘూర్ణిల్లు వారిరాశి
పైన గట్టినవంతెనపగిది నుండు
వాయుశక్తులు సంపూర్ణవశత మెలగ
మంచు మించు తుపానుల్ల సంచుతోడ
నరుగుతరి నాకు బహ్వర్ణమైనవిల్లు
దిగ్విజయతోరణంబయి తేజరిల్లు.

ఆర్ద్రమై భూమి క్రీడెన నలరుచుండ
నగ్నిగోళమునందుండి యర్యముండు
తనదు తేజంబు వినియోగమునకు దెచ్చి
యిడెడువర్ణముల్ చిత్రిత సీధనువుకు.

పుడమి నీళ్ళులకే గూర్మపుత్రి నగుదు;
ఆకసము నాకు ధాత్రికయై చెలంగు;
వసుధ వార్ధుల లీనమై పలు తెరగుల
మారుచుండుదుగాని నే మడియ నెపుడు.

వాన వెలిసిన నలుపెల్ల బాసి యంబ
రంబు నిర్మలమైయుండ రవికరములు
వాయువుల గూడ వ్యాపించి వర్ణనీయ
మయిన నీలంపుగుమ్మటం బభ్రమందు
గట్టిపై వంగ జూచి నావట్టిగోరి
యిదియెగాయని రుచినవ్వు నెగయజేసి
గర్భగోళంబు వెల్వడు కందుపగిది
కబరునం బుట్టు ప్రేతంపుగాయముగతి,
వర్ష గేహంబులందుండి బయలుదేరి
కట్టడంబెల్ల తృటిలోన మెట్టి విడుతు.

గా. హా.

# బడ్జెట్టు అనగానేమి?

శ్రీ గా. హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.

ఎవరి అధికారానికైనా—రాజకీయాధికారం మాట—ద్రవ్యశక్తి మూలాధారం. మహారాజులు రాజ్యము లేలినారంటే పదిమందినికొట్టి డబ్బు తెచ్చి తమపరంగా యుద్ధాలుచేసే వారిని పదిమందినీ చేర్చుకొని తమ యిష్టప్రకారం నాటకమాడినారు. ఏ రాజకీయాధికారంగాని ప్రత్యక్షంగా తమ చేతులలో లేని పెట్టుబడిదారులు జమీందారులు ఈదినం ప్రపంచంలో నాటకాలాడుతున్నారంటే వారి చేతులలోఉండే ద్రవ్యబలమే కారణం. దీనివివరణ యెక్కువగా వ్రాయనక్కరలేదు.

*    *    *    *

అందుచేతనే ప్రజలు తమ ప్రభుత్వాన్ని స్థాపించుకోవడానికిచేసే అన్ని ప్రయత్నాలలోను దేశాదాయం దేశవ్యయములమీద తమ కెంత అధికారం సంక్రమించుతుందా అని మొదట ప్రశ్న వేసుకుంటున్నారు. అధికారంలో ఉండే వాళ్లు ప్రజలు తమ హక్కులకై పోరాడితే శాసనసభలు సులభంగా నిర్మించియివ్వడం కనుపించుతుంది. ప్రశ్నలు వేయడానికి, తీర్మానాలు పెట్టడానికి, తుదకు శాసనాలు ప్రవేశపెట్టడానికి అన్నిటికి స్వతంత్రం కలుగజేసినా డబ్బుకు మాత్రం ప్రజా ప్రతినిధులను దూరంగా ఉంచుతారు. మన దేశము ఉదాహరణమే దీనికిచాలు. రాష్ట్రాలలో మన ప్రజలకు పరిపూర్ణస్వాతంత్ర్యం కలిగిందని పదివైపులనుంచి బ్రహ్మాండ ఘోష వినిపించుతున్నా ఇప్పటికీ డబ్బు విషయంలో బ్రిటిషు ప్రభుత్వం తన పట్టును వదలిపెట్టలేదు. ఇండియా దేశానికి గవర్నరుజనరలుగా తా మేర్పరచే అధికారి ఇండియా పరపతిని నిలపడానికి సర్వాధికారి. క్రొత్త చట్టముక్రింద ఇండియా ప్రభుత్వ మేర్పడినా కేంద్ర ప్రభుత్వంలో సైన్యానికి రైళ్లకు జీతాలకు బత్తాలకు ఇట్టి అనేకవిషయాలకు అయ్యే ఖర్చు లన్నిటిమీద అతనిదే పై చెయ్యి. అచ్చటఏర్పడపోయే మంత్రులకు ఆర్థికాధికారంలేదు. గవర్నరుజనరలు గారిఆర్థికసలహాదారుద్వారా అతడే ఆశాఖకు మంత్రి. ఖర్చుతో కూడుకొన్న ఏసలహాను ఆమంత్రులుచేసినా దానికి అతని అంగీకారము లేకపోతే ఆసలహా అంతరించవలసిందే. ప్రాంతీయ ప్రభుత్వాలలో గవర్నరుకు ఆర్థిక సలహాదారుణ్ణి నియమించుకునే అధికారం పెట్టలేదు. అతడు ఆకారణంచేత ఆర్థికమంత్రిత్వం నిర్వహించే మార్గం లేదు. మన ప్రతినిధి ప్రధానమంత్రి రాజగోపాలాచారిగారే ఆర్థికమంత్రి. తన ప్రత్యేకాధికారాలు వినియోగించకూడదని గవర్నరుతో ఒకవిధంగా విశ్వాసపాత్రమైనమాట తీసుకొని పనిలో ప్రవేశించిన శ్రీ రాజగోపాలచారిగారికిని కాంగ్రెసుపార్టీకిని రాష్ట్రంమట్టుకైనా సంపూర్ణమైన ఆర్థికాధికారంలేదు. క్రొత్త పన్నులువేసి ఎక్కువగా వసూలుచేసే అధికారం ఉంది. కాని ఖర్చుపెట్టడానికి వచ్చేటప్పటికి చార్జీ చేయబడిన (దీనినే చార్జిడ్ ఎక్స్పెండిచరంటారు) ఖర్చులని ఒక వర్గీకరణ మేర్పడింది. మొత్తము రు ౧౫,౯౩,౬౨,౩౦౦ ల ఖర్చులలో రు౨,౮౦,౮౩,౨౦౦లు చార్జిడ్ కర్చులుగా నేర్పడినవి. అనగా నూరురూపాయిలు ఖర్చు పెట్టవలసి ఉంటే రు ౧౦౦ ల మీద మన మంత్రులకు ఏవిధమైనఅధికారమూ లేదు. మిగిలిన రు ౮౨ ల మీదనైనా వీరికి పూర్ణాధికారములేదు. యూరోపియను ఆంగ్లోయిండియనుల చదువుకు ఒక లెక్కప్రకారము యిచ్చితీరవలెను. ఇట్టి నియమాలు ఇండియాప్రభుత్వ శాసనములోనే యేర్పడి ఉండడంచేత ఈఅధికారానికీ అడ్డంకు లేర్పడినవి.

ఇంతవరకు చెప్పినదంతా ఉదాహరణప్రాయం. దేనికి? అధికారంలో ఉండేవారు ఆర్థికాధికారం ప్రజల ప్రతినిధులచేతి కివ్వరనడానికి, ప్రజలు కోరే పూర్ణాధికారాలలో ఆర్థికాధికారం గొప్పదని సూచించడానికి.

* * * *

కాబట్టి ప్రజాప్రభుత్వం కలచోట అంతటను ప్రజాప్రతినిధులు ఆదాయవ్యయములమీద సంపూర్ణమైన అధికారంనడపుకోడానికి బడ్జెట్టు అనే ఆచారం ప్రచారంలోనికివచ్చింది. నాలుగు మాటలలో బడ్జెట్టు అనే పదానికి అర్థం చెప్పదలచుకొంటే సాలీనా ప్రభుత్వం వసూలు చేసే వసూళ్లు, ఆ వ్యయము చేసే ఖర్చులు ఏ యే బాపతుక్రింద ఎంతెంత జరుపదలచుకొన్నారనే విషయాన్ని అధికారం సంవత్సరపు పొడుగునా నడపవలసినమంత్రులు జాబితాచేసి ప్రజాప్రతినిధుల యెదుట నివేదించి వారి అనుమోదం పొందడం అని వివరించవచ్చును. అయితే చెప్పినంత సులభంగా తేలిపోయే ప్రక్రియకాదీవిషయం.

* * * *

౧౯౩౭-౩౮ వ సంవత్సరానికని శ్రీ రాజగోపాలాచార్లుగారు ప్రజాప్రతినిధుల యెదుట పెట్టిన బడ్జెట్టు సందర్భములో వారు పంపిన అచ్చుకట్టలు రమారమి ౯౦౦ అరటావు పేజీలైనవి. అసెంబ్లీ కౌన్సిలు రెండుసభల సమావేశములు జరిగినవి. మొదటిదినం అసెంబ్లీలో రాజగోపాలాచారిగారు ప్రత్యేక ముపన్యాసం చేసినారు. మరి మూడుదినములు ప్రజాప్రతినిధులు శాసనసభలలోచేరి ఈ బడ్జెటు ఏర్పాటులను మొత్తముగా పర్యాలోచించినారు. శరపరంపరలుగా ఉపన్యాసములు జరిగినవి. కొన్నాళ్లు వ్యవధియిచ్చి మరల అసెంబ్లీ సమావేశం పిలిచినారు. ఈ వ్యాసం ప్రకటించేనాటి కింకా అసెంబ్లీలో విషయవిమర్శ జరుగుతూనే ఉంది.

తాము కోరబోయే ఖర్చు మొత్తాలను ౩౭ బాపతులక్రింద విభాగించి ఏమంత్రికి సంబంధించిన విషయములో ఆ మంత్రి ఒక్కొక్కబాపతు అంగీకరించవలసిందని సభవారిని కోరుతున్నాడు. సభవారు ఒక్కొక్క బాపతును రెండుగంటల కొలది నియమాలప్రకారం ఆలోచించుతున్నారు. మంజూరు చేస్తున్నారు. మంత్రులు కోరేకోరిక "డిమాండు" అనే పేరుతో వ్యవహరింపబడుతున్నది. సభవారిచ్చే సమ్మతి "గ్రాంటు" క్రింద ఏర్పడుతుంది. అందరుమంత్రులు అన్ని డిమాండులవిషయములోను గ్రాంటులుపొందితే అప్పుడు వారు రాజ్యకార్యాలు నడపడానికి మార్గమేర్పడుతుంది. మొదటి మూడుదినముల జనరలు విమర్శలో నేమి ఈ డిమాండుల విమర్శలోనైతే నేమి మంత్రులు తామేమిచేయదలచుకొన్నారో ఆ వివరాలన్నీ చెప్పుకొంటారు. ప్రజలప్రతినిధులు తమతమ ప్రజల సుఖదుఃఖాలకి మంత్రుల రాజనీతి ఏమాత్రము కారణమౌతుందో వివరిస్తూ తమ కోరికలను సభవారియెదుట పెట్టుతారు.

* * * *

ఇప్పటి కాంగ్రెసు మంత్రివర్గంవారు ఈసంవత్సరాని కంతటికి బడ్జెట్టు తయారుచేసి సభవారి యెదుట పెట్టినా యిప్పటికి ఈ సంవత్సరంలో ఆరుమాసముల చెల్లుబడి గవర్నరుగారి అధికారం క్రింద అయ్యేపోయింది. వీరు జరుపదగిన కార్యం ఈసంవత్సరాని కింక ఆరుమాసాలకార్యమే. ఈఆరుమాసాలలోనే భూమిశిస్తు వసూళ్ళయ్యేది. కాబట్టి కాంగ్రెసుచేసే మొదటిపని భూమిశిస్తు తగ్గించడం. వారికివచ్చేశిస్తు ఆదాయములో ౭౫ లక్షలు వారు మానుకొనడం

నిశ్చయించినారు. "కాంగ్రెసువారెట్లా మంత్రులౌతారు. ఈతగ్గింపుమాట మనమే యెందుకు చెప్పి ఆగౌరవము మనకే తెచ్చుకోకూడ"దని మర్యాద మంత్రిత్వం చేసినరెడ్డినాయుడుగారీ ౨౫ లక్షలముజరా యిస్తామని చెప్పినారు. అవి కాంగ్రెసు మంత్రులు చెలామణిలో పెట్టుతున్నారు. ఈముజరాయైనా కాంగ్రెసు హృదయాన్ని కనుపరచడానికి పనికివచ్చునేగాని చాలాగొప్పలాభంగా ఎంచడానికి వీలులేదు. కొన్ని సంవత్సరాలనుంచి ౫౬ లక్షలముజరా ఇస్తున్నారు. ఇప్పుడు ౧౯ లక్షలు హెచ్చైనది. ఈ ముజరా చక్కగా రైతులకు అందేటట్టు చేయడంలోను, దీనిని పెంచడములోను ఖాయం చేయడములోను లేదా రైతుబరువు తగ్గించడానికి నాణ్యరూపంగా ఇచ్చేపన్ను విధానాన్ని తొలగించి అతడు పండించిన వస్తువును తీసికొని అతనిని ఉద్ధరించడంరూపకంగాను కాంగ్రెసువారు ముందు కెక్కువకార్యభారము వహింపవలసి ఉండును. ఇప్పటికి వీరికి వారాలవ్యవధితప్ప ఎక్కువలేదు కాబట్టి పూర్ణమైన ఆలోచన చేయడానికి అవకాశం దొరకలేదు.

* * * *

కాంగ్రెసు మంత్రివర్గమువారు తలపెట్టిన రెండవకార్యం త్రాగుడునిరోధం. అది రాష్ట్రిమంతటా జరుగవలసిందే. కాని ప్రస్తుతం సేలం జిల్లాలో ఆరంభం చేస్తున్నారు. అందులో వచ్చే నష్టము సంవత్సరానికి ౨౬ లక్షలు. ఈ ఆరుమాసాలకు ౧౩ లక్షలు. కాంగ్రెసు ౧౬ సంవత్సరాలనుంచి ఉద్యమం నడపుతూవచ్చింది. ఇప్పుడు అవకాశం దొరకడంతో పూర్తిగా ప్రయత్నంచేయడం కాంగ్రెసు మంత్రివర్గాలవారు నిశ్చయించుకొన్నారు.

దీనికి ఆక్షేపణ ఉండనేకూడదు. కాని ఆక్షేపించేవారు లేకపోలేదు. శాసనసభలలో ఆక్షేపణలు జరిగినవి. ప్రత్యుత్తరములు ఇచ్చినారు. త్రాగడం సప్తవ్యసనాలలో నొకటిగా ఎంచి పాపాలలో పాపముగా పరిహరించే భారతప్రజలకు ఆక్షేపణలతోను పనిలేదు. ప్రత్యుత్తరాలతోను పనిలేదు; త్రాగుడు నిరోధించేపనికి అందరు తోడ్పడవలసింది ఒకటే కర్తవ్యం.

* * * *

నేటి బడ్జెట్టులో వడుకునూలు పరిశ్రమ యభివృద్ధికి ౨ లక్షల రూపాయలు ప్రత్యేకపరచినారు. చక్కగా తయారైననూలు గుడ్డలనుబట్టి తప్ప ఇతరవిధంగా ధనవ్యయము చేయడములేదని ప్రకటించి శ్రీరాజగోపాలచారిగారు ఈ గ్రాంటు దుర్వినియోగం కావటానికి వీలులేదని ఆక్షేపకులకు సమాధానము చెప్పినారు. చేతినూలు ఉత్పత్తిచేసే సోదరులును, చేయదలంచుకొనిన సోదరులును గమనింతురుగాక.

* * * *

మరియొక ముఖ్యవిషయము నేటి బడ్జెట్టులో కనుపించును. జైళ్ళలోవుండే ఖయిదీలందరికి మజ్జిగ పోయించుటకు ప్రభుత్వమువారు పూనుకొన్నారు. దీనికిగాను ౨౫ వేల రూపాయలు ప్రత్యేకించినారు. ఇది రాజకీయ ఖయిదీలకొరకు చేసినదికాదు. ఇప్పుడు రాజకీయఖయిదీలు లేరు. "కాంగ్రెసనేసంస్థ అందులో పనిచేసేవారి సౌఖ్యాని కేర్పడినదికాదు. మహాజనోపయోగమున కేర్పడినది" యనుట కాంగ్రెసుమంత్రులు దురదృష్టవంతులకు చేసిన ఈ సేవచేత చాల స్ఫుటముగా స్పష్టపడుచున్నది.

* * * *

కాంగ్రెసు మంత్రులు జీతాలు రు ౫౦౦లకు తగ్గించుకొన్నారు.

బత్తెములు తగ్గించుకొనినారు. హెచ్చు జీతాలు కల సర్కారునౌకరులు తమ తమ జీతాలలో ఐచ్ఛికంగా కోతలకు ఒప్పుకొనవలసినదని కోరి

నారు. దీనికి ఫల మెంతకలుగునో ఇకముందు తెలియవలెను. చట్టము ప్రకారము తమస్వాధీనములో ఉండే జీతాల విషయంలో ముందుకు నూటికి ౨౫ మొదలు ౩౦ వంతులవరకు కోతలు పెట్టునట్లు అభిప్రాయము తెలిపినారు. చిన్న జీతాలవారిని బాధింపరని నమ్మతగి యున్నది.

*　　*　　*　　*

బడ్జెట్టులోని అన్ని ఇతర వివరాలు వ్రాయడము సాధ్యముకాదు. కాని గ్రంథాలయాలకు సంబంధించిన సంగతివదలి పెట్టరాదు. మద్రాసు రాష్ట్రములోని గ్రంథాలయాలకు కొంతకాలము సంవత్సరమునకు రు. ౨౦,౦౦౦ ల వంతున సర్కారువారు గ్రాంటు నిచ్చేవారు. కొన్ని సంవత్సరాలనుంచి రు ౧౦,౦౦౦ఇస్తున్నారు. ఈసంవత్సరం అది రు. ౫౦౦౦కు దిగిపోయినది. గవర్నరు గారు మంజూరుచేసిన ఆరుమాసాల బడ్జెట్టులో వేసిన అంకేయిది. నాగరకరాజ్యాలలో అంతటా — ఇంగ్లండు, అమెరికా బోలినరాష్ట్రాలలో — గ్రంథాలయసేవ — అనగావయోజనవిద్యాసేవయన్నమాట — ఇంటికి మనిషికిమనిషికి చెందింప జేయడానికి లక్షలపౌనులు, డాలర్లు ఖర్చు పెట్టేసమయములో ప్రతిమానవునకు వోటిచ్చి కాన్‌స్టిట్యుయెంటు అసెంబ్లీద్వారా స్వరాజ్యవిధానాన్ని వ్రాయింపించగోరు మనమంత్రులు ఈవిషయమున ఏల యభినివేశము చూపలేదా యని ప్రశ్నించుకొనవలసివచ్చినది. వారికి వ్యవధి చాలలేదుకాబోలు. కాంగ్రెసువారి దృష్టిలోకే యీవిషయ మింకను ఎక్కకపోవడం కారణం కాబోలు ననుకొనవలసివచ్చినది. కాని ఇండియా గవర్నమెంటువారిచ్చే గ్రామపునర్నిర్మాణపు గ్రాంటు ౧౫ లక్షలనుంచి కొంతసొమ్ము కోరిక కలిగితే గ్రామములలో రీడింగురూములతో కూడిన హాలులు కట్టుటకు వినియోగింతుమని కో ఆపరేటివు విషయాలలోచేర్చి బ్రాకెట్టుల మధ్య వ్రాసియుండడముకంటికి గోచరించి కొంతతృప్తికలిగించినది. మెలకువగాఉంటే గ్రంథాలయాలవారు తమయూళ్ళలో హాలుకట్టడానికి రీడింగురూము పెట్టడానికి సగముసొమ్ము వసూలుచేసికొని మిగతా సగముసొమ్ముకు దరఖాస్తు పెట్టుకొగలిగిన పరిస్థితులుకలిగినా చాలమేలగునని తోచింది. మంత్రి శ్రీ రాజగోపాలాచారిగారు గ్రామాలలో రేడియోలు పెట్టదలచినామనియు, తన్మూలకముగా వయోజనవిద్య విజృంభించుటకవకాశమగుననియు చెప్పినారు. గ్రామపు రీడింగురూములహాలులలో ఈ రేడియోలు పెట్టడము జరిగితే గ్రంథాలయోద్యమాభిమానులు మిక్కిలి సంతసింపగలరు. ఇప్పటికే లోపమున్నా ఇకముందునకైనా కాంగ్రెసు మంత్రులు గ్రంథాలయములను వయోజనవిద్యను ప్రత్యేకవిషయముగా గణించి తగినసదుపాయములు చేయుదురుగాక యని దేశమెదురుచూచుచుండగలదు.

*　　*　　*　　*

మొత్తముమీద కాంగ్రెసువారి మొదటి ప్రభుత్వపు ఆరుమాసములబడ్జెట్టు భారతభూమిలో అన్నివర్గములవారికివి తృప్తికరమని తోచినది. మన రాష్ట్రంలో జస్టిసుపార్టీనాయకులైన సర్ మహ్మదు ఉస్మాన్ సాహెబుగారుకూడ హృదయపూర్వకముగా మంత్రుల నభినందించి త్రాగుడు నిరోధపుటుద్యమానికిపూర్ణసహాయము తమ పార్టీవారు చేయగలరని ప్రకటించినారు. కార్యారంభము చక్కగానుంటే సగముకార్యము ముగిసినట్లేయని ఒక ఆంగ్లలోకోక్తికలదు. మన మంత్రుల బడ్జెట్టు సందర్భమున ఆ లోకోక్తి జ్ఞాపకమునకు వచ్చుచున్నది.

ప్రజలు ఓపికపట్టి సహాయపడే దృష్టితో తమ బాధ్యతలు తాము వహిస్తే కాంగ్రెసు మంత్రివర్గాలు కార్యదక్షత కనుపరచగలవను ఆశ దేశాభిమానహృదయములకు కలిగినది. సర్వేజనా స్సుఖినోభవన్తు.

# భారతదేశము-ప్రభుత్వ సైనిక పరిపాలనము

శ్రీ మతం బాలసుబ్రహ్మణ్యగుప్తగారు

## ఆక్సిలియరీదళములు

మహాసంగ్రామానంతరను ఇండియాలో ఉండు బ్రిటిషుప్రజల కందరకు నిర్బంధసైనిక శిక్షణ మొసఁగవలె ననువిషయము చర్చకు వచ్చెను. నిర్బంధశిక్షణముకన్న ఐచ్ఛికశిక్షణ మొసంగుటయే మేలని నిశ్చయించి ౧౯౨౦ వ సంవత్సరములో అందు కనుగుణ్యముగ చట్టము చేసిరి. ఆచట్టముప్రకారము బ్రిటిషు ఇండియాలోని ఆంగ్లయువకులకు అన్నివిధముల సైనిక శిక్షణమును ఇచ్చి పెద్దలకు తుపాకులను ఉపయోగించుశిక్షణముమాత్ర మిచ్చుటకు ఏర్పాటు చేసిరి. ఇవియే ఆక్సిలియరీ దళములు. వీరికి శిక్షణకాలము సంవత్సరములో కొన్నిదినములు మాత్రమే. వీరికి జీతబత్తెములులేవు. ప్రభుత్వమువారు ఆపత్సమయములో అవసరమైనప్పుడు వీరిసేవకైకొందురు. విదేశవ్యవహారములతో వీరికి పనిలేదు. ఈదళములలోకూడ కాల్బలములును అశ్వశతఘ్నిదళములును ఉన్నవి. వీరిలోనే స్థానికసైనికాధికారులున్నారు. వీరు ఆయామండల సైనికాధికారుల అధికారముక్రింద ఉందురు. కరాచి, బొంబాయి, కలకత్తా, మద్రాసు, బెంగుళూరు మొదలగు పట్టణములలో వీరికేంద్రము లున్నవి.

## ఇండియన్ టెరిటోరియల్ దళములు

సైనిక పరిపాలనము ప్రథమమునుండియు ఆంగ్లేయుల హస్తగతమై యుండెను. ఇండియనులకుకూడ ఇందు కొంతఅవకాశము కలుగచేయు ఉద్దేశముతో కొన్నిమార్పులు చేసిరి. దీనిపర్యవసానముగ ఏర్పడిన శాఖలలో ఇండియన్ టెరిటోరియల్ దళ మొకటి. రెగ్యులరుదళములకు సహాయముగ నుండుటయే దీని ఉద్దేశము. కేవలము స్థానిక దేశీయావశ్యకతలకు మాత్రమే గాక విదేశయుద్ధములలోకూడ పాల్గొనుట కివి యుద్దేశింపబడినవి. ఇండియన్ టెరిటోరియల్ దళములు మూడుభాగములు: (౧) రాష్ట్రదళములు (ప్రొవిన్షియల్ బెటాలియన్సు) (౨) నగరదళములు (అర్బన్ యూనిట్సు) (3) యూనివర్సిటీ శిక్షణదళములు (యూనివర్సిటీ ట్రైనింగుకోర్ యూనిట్సు). యూనివర్సిటీశిక్షణదళములువిద్యార్థులు చదువుకొనుకాలములో శిక్షణమునకును తరువాత రాష్ట్రపట్టణదళములకు ఉద్యోగులను సరఫరాచేయుటకును ఉద్దేశింపబడినవి. ఇందులో కాల్బలదళములును వైద్యశాఖాదళములును మాత్రమున్నవి. ఇపుడున్న రాష్ట్రీయదళములు ౧౮. వీటి శిక్షణకాలము ౪ సంవత్సరములు మొదలు ౬ సంవత్సరముల వరకు; సంవత్సరములో వీరు శిక్షణము పొందవలసినది ఒక నెలమాత్రమే. నగరదళములశిక్షణకాలము ౬ సంవత్సరములు. మొదటి సంవత్సరములో ౩౨ రోజులును తతిమ్మాసంవత్సరములలో సాలుకు ౧౬ రోజులును వీరు శిక్షణము పొందవలెను.

## స్వదేశసంస్థానముల సైన్యము

హిందూదేశములోఉన్న ౫౬౨ స్వదేశ సంస్థానములలో ముఖ్యమగు కొన్నిటికి మాత్రమే సొంతసైన్యముకలదు. ఈసైన్యపుఖర్చు ఆయా సంస్థానాధిపతులే పెట్టుకొందురు. ఆయా సంస్థానములరక్షణ నిమిత్తమును ఆపత్సమయ

ములలో బ్రిటిషుప్రభుత్వమువారికి సాయము చేయుటకును ఇవి ఏర్పడినవి. ౧౯౧౪ సం॥ ఐరోపా మహా సంగ్రామమువఱకు ఈసంస్థాన సైన్యము—ఏకొద్ది సైన్యమునకో తప్ప - సక్రమపద్ధతులలో శిక్షణముకాని తగిన ఆయుధములు కాని లేక కేవలము సంస్థానాధీశుల ఉత్సవములలో పటాటోపములకు మాత్రము ఉపయోగ పడుచుండెడిది. ౧౯౨౦ వ సంవత్సరములో బ్రిటిషు ప్రభుత్వమువారు ఈసంస్థానాధిపతులతో సంప్రదించి ఉభయులలాభమునుద్దేశించి వారి సమ్మతిపైని సంస్థానముల సైన్యపునర్నిర్మాణమునకు కడంగిరి. పై కార్యములకుబ్రిటిషు ప్రభుత్వమువారు కొంతమంది ఆంగ్లేయ సైనిక ప్రవీణులను (మిలిటరీ అడ్వైజరు ఇన్-చీఫ్ అసిస్టెంటు అడ్వైజర్సు అను హోదాలుకలవారిని) నియమించిరి. ఈపని చాల సంస్థానములలో అమలులోనికి వచ్చెను. సంస్థానములలోని సైన్యములకును బ్రిటిషు ఇండియా ప్రభుత్వ సైనిక శాఖకును ప్రత్యక్షసంబంధము లేదు. సంస్థాన సైన్యములకు వారివారి సొంత సైన్యాధ్యక్షులు సొంత సేనాధిపతులును కలరు. ఏసంస్థానాధిపతియైనను తమ సంస్థానమందు తగిన సైనికోద్యోగి లభింపనియెడల బ్రిటిషు ప్రభుత్వసేనలో ఉండు ఒకఉద్యోగిని కోరి తీసికొనవచ్చును. ఈ ఉద్యోగి కొలువులో ఉన్నంతకాలము అతని జీత బత్తెములును తరువాత పెన్షనులుకూడ బ్రిటిషు ప్రభుత్వమునకు సంస్థానమువారు చెల్లింపవలెను. సంస్థానసైన్యములకు వలయు ఆయుధ పరికరములన్నియు బ్రిటిషు ప్రభుత్వమువారే విక్రయించుచుందురు. అట్టి ఆయుధములపై ఆయాసంస్థానముల పేర్లును ముద్రికలును ఉండును.

సంస్థాన సైన్యములు మూడువిధములుగ ఏర్పరచినారు - మొదటిరకము:- ఆయుధముల లోను శిక్షణములోను బ్రిటిషు ఇండియాదళములను పోలినవి. రెండవరకము:- ౧౯౧౪ సం॥ కు పూర్వము ఉండియున్న బ్రిటిషుఇండియా దళములనుపోలినవి. మూడవరకము:- పై రెండు రకములుకన్నను ఆయుధములలోను శిక్షణములోను కనిష్ఠమైనవి.

స్వదేశసంస్థానములన్నిటిలోను కలిసి మొత్తము ఈదిగువ వ్రాసినసంఖ్యలకు మించకుండ వివిధదళములను ఉంచుకొనుటకు బ్రిటిషు ప్రభుత్వమువారు అనుమతి నిచ్చియున్నారు.

| | అనుమతిపొందిన సంఖ్య | ఇపుడున్న సంఖ్య |
|---|---|---|
| ౧. శతఘ్నిదళములు | ౧,౬౧౬ | ౧,౫౯౯ |
| ౨. అశ్వదళములు | ౯,౬౪౮ | ౯,౦౬౬ |
| ౩. కాల్బలములు | ౩౪,౬౮౪ | ౨౯,౫౦౯ |
| ౪. మోటారుమిషను ఫిరంగులు | ౧౦౦ | ౮౫ |
| ౫. ఇంజనీరింగు దళములు | ౧,౩౦౭ | ౧౦౬౭ |
| ౬. సామానులుచేర్చు దళములు (ట్రాన్సుపోర్టుకోర్) | ౧౫౬౦ | ౧౬౦౮ |
| వె | ౪౯,౩౭౧ | ౪౩,౩౮౭ |

సంస్థానములలోని సైనికోద్యోగుల హోదాలు బ్రిటిషు ఇండియా సైనికోద్యోగులహోదాల వలెనే లెఫ్టినెంటుజనరల్, మేజర్ జనరల్, బ్రిగేడియరు, కల్నలు, లెఫ్టినెంటుకల్నలు, మేజరు, కెప్టెను, లెఫ్టినెంటు మొదలగునవి వాడవచ్చును. సంస్థానముల ప్రధానసేనాధిపతులలో హెచ్చుమంది భారతీయులే. క్రొత్తపద్ధతులపై సంస్థానముల పునర్నిర్మాణ మొనర్చుటనుగురించి ఢిల్లీలోని నరేంద్రమండలి స్థాయిసంఘమువారు సంస్థానముల సేనాధిపతులతోను, బ్రిటిషుసైని

కొద్యోగులతోను కూడిన ప్రత్యేక సంఘ
మును క్రిందటినెలలో ఏర్పాటుచేసియున్నారు.
దీనికి ముఖ్యకారణము ప్రాగ్దేశములలోని
చైనా జపానురాజ్యముల సంఘర్షణమును,
స్వదేశ సంస్థానముల ప్రజలలో కలిగినఆర్థిక,
సాంఘిక, రాజకీయాందోళనములే. బ్రిటిషు
ఇండియాలో ప్రజలు స్వాతంత్ర్యము కొఱకు
చేయుచున్న అందోళన పర్యవసానముగ సంస్థాన
ముల ప్రజలుకూడ వారిహక్కులకొఱకు పెను
గులాడ మొదలిడినందున సంస్థానముల వారును
బ్రిటిషువారును పైపునర్నిర్మాణమును గురించి
ఆలోచింపవలసిన అవసరమేర్పడినది. పైనిపేర్కొ
నిన స్వదేశసంస్థానముల సైన్యములో హెచ్చు
భాగము ఈక్రింద నుదాహరించిన పెద్దసంస్థా
నములలో ఉండియున్నది. ౧ హైదాబాదు
౨ కాశ్మీరము ౩ గ్వాలియరు ౪ పాటియాలా
౫ బరోడా ౬ మైసూరు ౭ ఇండూరు ౮ జయ
పూరు ౯ జోద్పూరు ౧౦ బికనీరు ౧౧ భోపాల్
౧౨ తిరువాన్కూరు ౧౩ భరతపురము ౧౪ నవా
నగరము ౧౫ జూనాగడు మొదలగునవి. స్వదేశ
సంస్థానములలో క్రమశిక్షణము పొందిన సైన్య
ములుగాక, శిక్షణమును నవీనపు ఆయుధములును
లేని సైన్యము కొన్నివేలకు మించియున్నది.
ఇవిగాక సంస్థానాధీశుల అంతఃపురములు ఉద్యా
నవనములు కాపలాకాచుటకు ప్రత్యేక సైన్య
ములు కొన్నివేలకు మించియున్నవి. ఇవిగాక
అంగరక్షకులు మొదలగు వారు వారివారి
హోదాలనుబట్టి వందలసంఖ్యలో ఉన్నారు.

హిందూదేశపు సైనికశాఖలో ఇపుడున్న
ఉద్యోగులు రెండురకములు. ౧- కింగ్సుకమిషను
ఉద్యోగులు ౨ వైస్రాయి కమిషను ఉద్యో
గులు. వైస్రాయికమిషను ఉద్యోగు లందరును
భారతీయులే. ఇండియా సైనికశాసనముప్రకా
రము వీరి అధికారములును హోదాలును స్వల్ప
ములు. ఇటీవల సాంధర్ట్సు మిలిటరీకాలేజీద్వా
రాను, ఊల్విచ్చిలోని రాయల్ మిలిటరీఎకాడ
మీ ద్వారాను భారతీయసైనిక శాఖలోచేరిన
కొందరు భారతీయులకు కింగ్సు కమిషనుహోదా
యిచ్చిరి. ఇండియా సైన్యములో కింగ్సు కమి
షను ఉద్యోగము రెండు తరగతులవారికినిచ్చు
చున్నారు. ౧ సాంధర్ట్సురాయలుమిలిటరీకాలేజి
పరీక్షలలో ఉత్తీర్ణులైనవారికిని ౨ బ్రిటిషుపటా
లములలో పనిచేసి ఇండియా సైన్యములోనికి
తీసికొనబడిన ఆంగ్లేయ ఉద్యోగులకును ౩ అప్పు
డప్పుడు యూనివర్సిటీలలోనిశిక్షితులకునుకూడ
ఈ ఉద్యోగము లిచ్చెదరు. సాంధర్ట్సు కళాశాలలో
శిక్షణముపొంది కమిషను పొందినవెంటనే అట్టి
శిక్షితులను తాత్కాలిక ఆఫీసర్లుగా (అన్ అటా
చ్డ్ లిస్టులో) నియమింతురు. తరువాత ఒక సంవ
త్సరముకాలము ప్రత్యేక శిక్షణమునకు ఇండి
యాలోని బ్రిటిషు పటాలముల పనిలో నియ
మింతురు. అటుపిమ్మట ఇండియా సైన్యములో
ఒక రెజిమెంటుకుగాని, ఒక బెటాలియనుకుగాని
స్క్వాడ్రను ఉద్యోగిగానో కంపెనీ ఉద్యోగిగానో
నియమింతురు. భారతీయ పటాలములలో కింగు
కమిషను పొందిన ఉద్యోగులకు లెఫ్టినెంటు
కల్నలు హోదావరకు క్రమాభివృద్ధి ఉండును.
ఈ అభివృద్ధి పొందుటకు వారు మరికొన్ని పరీక్ష
లలోకూడ ఉత్తీర్ణులు కావలెను. మామూలు
పద్ధతిలో ౨౬ సంవత్సరముల సర్వీసు అనంత
రము లెఫ్టినెంటుకల్నలుహోదా లభించును.
ఇంతకుమించిన హోదాలు ఎన్నికలవల్ల నిర్ణ
యింతురు.

### భారతీయోద్యోగులు

ఐరోపా మహాసంగ్రామమునకు ముందు

భారతీయులకు కింగ్సుకమిషనుహోదా ఉండెడిది కాదు. సంగ్రామానంతరము ఈ అవకాశము కలుగజేసిరి. ఈదిగువ నుదాహరించినహోదాలు కింగ్సుకమీషనుకు సంబంధించినవి - సెకండు లెఫ్టినెంటు, ఫస్టులెఫ్టినెంటు, కెప్టెను, మేజరు, లెఫ్టినెంటు కల్నలు. ౨౬ సంవత్సరముల సేవానంతరము సెలెక్షను పొందిన కింగ్సు కమిషను ఉద్యోగిని కల్నలు అందురు. అటుపైని వారు సుపీరియరుకింగ్సు కమషనుహోదాలో చేరుదురు. వీరిని గురించిన వివరములు మొదటిభాగములో (బ్రిటిషు సైనికోద్యోగుల హోదాలు అనుశీర్షిక క్రింద) ఉదాహరింపబడినవి. పై వివిధహోదాలు గల ఉద్యోగస్థుల దుస్తులలో ఎక్కువ తేడాలు లేవు. వారు ధరించు ముద్రికలలో మాత్రము కొన్ని తేడా లుండును. ఆయాపటాలముల పేర్లను బట్టి ముద్రిక లిచ్చెదరు. సెకండు లెఫ్టినెంటు హోదాగలవారు భుజములమీద ఒక్కొక్క నక్షత్రాకారముగల ఇత్తడి ముద్రికయును, ఫస్టులెఫ్టినెంటు హోదాగలవారు అట్టివే రెండేసి ముద్రికలును, కెప్టెనుహోదాగలవారు అట్టివే మూడుముద్రికలును, మేజరు హోదాగలవారు కిరీటాకారముగల ఒక్కొక్క ముద్రికయును, లెఫ్టినెంటు కల్నలుహోదా గలవారు ఒక్కకిరీటమును నక్షత్రాకారముగల రెండురెండు ముద్రికలును, కల్నలు హోదాగలవారు రెండునక్షత్రములు,కిరీటాకారముకల మూడు మూడుముద్రికలు ధరింతురు. ప్రతిపటాలమునకు అందులో పని చేయు సిపాయి మొదలు పటాల సేనాధిపతి వఱకు గుండీలు, ముద్రికలు అన్నియు ఒకేరకముగా ఉండును. భుజములపై ధరించు బాడ్జీలు మొదలగువానిని బట్టియే వారివారి హోదాలు తెలిసికొననగును.

నాన్‌కమిషన్డ్ ఉద్యోగులనుగురించి లోగడ వ్రాయనైనది. వీరి దుస్తులకును ఇతర ఉద్యోగులదుస్తులకును తేడా ఏమియులేదు. చొక్కాచేతులు రెంటిమీద చారలుగల గుడ్డపేలికలు (అరములెట్లు) ఉండును. ఇందులో లేన్సుకార్పొరోలు హోదాగలవారికి చేతులమీద అరములెట్టు ఉండును. కార్పొరోలుహోదా గలవారికి రెండురెండుఉండును. సార్జెంట్లకు మూడుమూడు అరములెట్లును, భుజములపైనుండి క్రిందికి వ్రేలాడు ఎఱ్ఱఉన్నిపటకాయును, సార్జెంటు మేజరులకు రెండుచేతులమీదను ఇత్తడి కిరీట ముద్రికలు, కమిషన్డ్ఉద్యోగులు ధరించు తోలు క్రాసుబెల్టు, ఉద్యోగులు ధరించుకోటును ఉండును. ఈఉద్యోగులు చిన్నచిన్న సైనికదళములకు అధికారులుగ ఉందురు. సైనికుడు మొదలుసర్వసేనాధిపతివరకు అందరకు ప్రభుత్వము వారే దుస్తులు సప్లయిచేయుదురు. నాన్‌కమిషన్డ్ ఉద్యోగులజీతబత్తెముల పరిమాణమును ఇతర సైనికులకన్న అధికము.

భారతీయులు కింగ్సుకమిషను హోదాపొందదగినవిధములు మూడు (౧) సాంధర్ట్సు కళాశాలలో శిక్షణముపొంది ఉత్తీర్ణతపొందుట మూలమున (౨) ఊల్విచ్చి కళాశాల పరీక్షలలో ఉత్తీర్ణులగుట మూలమున (3) భారతీయ పటాలములనుండి వారివారి సేవాయోగ్యతలను బట్టి ప్రత్యేకముగ ఎన్నుకొనబడుట మూలమున. మొదటి రెండువిధములుగ కింగుకమిషను హోదా పొందినవారు అట్టి హోదాగల ఆంగ్లేయోద్యోగులు పొందుఅన్ని సౌకర్యములను పొందగలుగుదురు. ఇట్టి హోదాను పొందుటకు ౧౯౩౦ వఱకు సాంధర్ట్సు కళాశాలలో ౧౦ మందికిని ఊల్విచ్చి కళాశాలలో 3 రికిని అవకాశముండెడిది. కొంతకాలము తరువాత ఇంగ్లాండు

లోని ఈ సాంధర్స్టు, ఊల్విచ్చి కళాశాలలలో చేరుటకుగాను భారతీయ విద్యార్థులను తరిబీతు చేయు నిమిత్తము బెంగాలులో డెహ్రాడూన్ అను చోట ఒక సైనికకళాశాల నేర్పరిచిరి. అందు శిక్షణకాలము ౬ సంవత్సరములు. ౭౦ మంది విద్యార్థులు శిక్షణపొందుటకు ఏర్పాటుగలదు. దిగువవ్రాసిన పటాలములు కింగుకమిషను హోదాపొందిన భారతీయోద్యోగుల అధికారముక్రింద ఉన్నవి. (౧) ౭ వలైటు అశ్వదళము (౨) ౧౬ వలైటు అశ్వదళము (3) ౨ వ బెటాలియను మద్రాసు పయొనీర్సు (౪) ౪/౧౯ హైదరాబాదు లైటుకాల్బలము (౫) ౧/౭ రాజపుత్రి రెజిమెంటు (౬) క్వీనువిక్టోరియా సొంత లైటు కాల్బలము (౭) ౧/౧౪ పంజాబు రెజిమెంటు (౮) ౨/౧ పంజాబు రెజిమెంటు.

౧౯3౨ వ సంవత్సరములో భారతీయాశ్వదళములలో ఒక బ్రిగేడును, అన్నిరకముల ఆయుధములుగలిగిన ఒక డివిజనును పూర్ణముగ భారతీయాధికారుల అధీనమొనర్చుటకు ఏర్పాటుచేయబడెను. ఈ మార్పు ప్రథమమున ఈ క్రింది దళములలో చేయబడెను. (౧) 3 వ అశ్వదళము (౨) 3/౨ పంజాబు రెజిమెంటు (3) ౫/౬ రాజపుత్రిరైఫిల్సు (౪) ౫/౮ పంజాబు రెజిమెంటు (౫) ౫/౧౦ బెలుచీ రెజిమెంటు (౬) ౫/౧౯ సిక్కు రెజిమెంటు (౭) ౪/౧౨ ఫ్రాంటియరు ఫోర్సు రెజిమెంటు (౮) ౬ వ రాయలు బెటాలియను (౯) ౧3 వ ఫ్రాంటియరు ఫోర్సు రైఫిల్సు. ఇవిగాక సంపూర్ణముగ భారతీయాధికారులచే నిర్వహింపబడుటకు శతఘ్ని ఇంజనీరింగు మొదలగు దళములలో ఒక్కొకటికూడ వారి అధీనమొనర్చిరి. కాల్బలములు, అశ్వదళములు, శతఘ్నిదళములు, సిగ్నల్‌దళములు మొదలగువాని కన్నిటికిని భారతీయోద్యోగులను తరిబీతుచేయునిమిత్తము ౧౯3౨ అక్టోబరునెల మొదలు డెహ్రాడున్ కళాశాలలో సైనిక శిక్షణము ప్రారంభించిరి.

## సైనికశిక్షణస్థానములు

ఉత్తమశిక్షణము పొందుటకును దళములను తరిబీతుచేయగల నేర్పరులను తయారు చేయుటకును ఇండియాలో ఈదిగువ పేర్కొనినస్థానములలో శిక్షణాలయములుకలవు.

౧ స్టేఫ్ కాలేజి—క్వెట్టా

౨. సీనియర్ ఆఫీసర్సు కాలేజి—బెల్గాం

3. స్కూలు ఆఫ్‌ఆర్టిలరీ—కాకుల్

౪. ఈక్విటేషనుస్కూల్—సాగర్

౫. స్మాల్ ఆరమ్సుస్కూల్ (ఇండియా) - పచమారి అండ్ అహమదునగరు

౬. ఆరమ్సుస్కూలు ఆఫ్‌ఫిజికల్ ట్రైనింగు - అంబాలా

౭. ఆర్మీసిగ్నల్‌స్కూలు—పూనా

౮. రాయలుటాంకుకోరుస్కూల్ - అహమదునగరు.

౯. ఆర్మీస్కూలు ఆఫ్‌ఎడ్యుకేషను-బెల్గాం

౧౦. ఆర్మీస్కూల్ ఆఫ్‌కుకరీ—పూనా

౧౧. ఆర్మీ వెటరినరీస్కూల్సు, అంబాలా- & పూనా

౧౨. ఇండియను ఆర్మీసర్వీసుకోరు ట్రైనింగు ఎస్టాబ్లిషుమెంటు—రావల్‌పిండి

౧3. ఇండియను ఆర్మీఆర్డినెన్సు కోరుస్కూలు ఆఫ్‌ఇన్‌స్ట్రక్షన్—కర్కీ

భారతీయ పటాలములకు వలయు ఉద్యోగులను సైనికులను తయారు చేయుటయే ఈ సంస్థల ఉద్దేశము. చిన్న ఆయుధముల, మిషను ఫిరంగుల స్కూల్లుకూడ ౧౯౨౭ ఫిబ్రవరిమాసములో పై సంస్థలకు అనుబంధముగ చేర్చబడినవి. పచమారీలో చిన్న ఆయుధముల శిక్షణమును, అహమదునగరులో మిషను ఫిరంగుల శిక్షణమును ఇచ్చుటకు ఏర్పాటుచేసిరి. ఈ దిగువ కళాశాలలో భారతీయసైనికుల పిల్లలకు సైనికశిక్షణ మిచ్చెదరు.

౧ కింగుజార్జిరాయల్ ఇండియన్ మిలిటరీ స్కూల్సు—జీలం, జలందరు, అజ్మీరు.

౨ కిచనరుకళాశాల—నౌగాంగు.

కిచనరుకళాశాలలో నాన్‌కమిషను ఉద్యోగులు వైస్రాయికమిషను హోదాపొందుటకు వలయుశిక్షణమిచ్చెదరు. డెహ్రాడున్ లో నిప్రిన్సు ఆఫ్ వేల్సు రాయల్ ఇండియను మిలిటరీ కళాశాలలో కింగ్సుకమిషను హోదా పొందదలచువారికి ప్రాథమికశిక్షణ మిచ్చెదరు.

## భారతదేశములో రిజర్వు సైనికోద్యోగులు

ఐరోపా మహాసంగ్రామమునకు ముందు రిజర్వు ఉద్యోగులు ఎక్కువమంది లేరు. యుద్ధములో కనిపించిన అవసరములనుబట్టి ౧౯౨౨ వ సంవత్సరములో ఇండియాసైన్యపు రిజర్వుఉద్యోగులశాఖ ప్రత్యేకముగ ఏర్పాటు చేసిరి. ౧౯౨౬ లో అందు కొన్ని మార్పులు జరిగెను. ఈ మార్పులలో ముఖ్యమైన దేదన రిజర్వు ఉద్యోగులు కమిషనుహోదా పొందుటకు కలుగజేసిన అవకాశము. ఈ మార్పుప్రకారము దిగువ పేర్కొనినవారు కమిషన్‌హోదా పొందుటకు అర్హులు.

౧ కింగ్సుకమిషనుహోదా పొంది చక్రవర్తిగారి సైన్యములనుండి విరమించినవారు.

౨ సైనికోద్యోగులు గాక స్థానికప్రభుత్వముల క్రిందగాని ఇండియాప్రభుత్వము క్రిందగాని సేవచేయుచున్న ఇతరోద్యోగులు.

౩. అవసరమగు శిక్షణమును పొందిన యోగ్యతగల ఇతర భారతదేశ నివాసులు.

రిజర్వుశాఖలోకూడ అన్నిరకముల ఆయుధములుగల దళములున్నవి. రిజర్వుఉద్యోగులందరును కనీసము సంవత్సరమునకు ౩౦ రోజులుశిక్షణము పొందవలెను. శిక్షణములలో వారి హోదాగల తక్కిన ఉద్యోగులకువలెనే వారికిని జీతబత్తెములు ఇచ్చెదరు. ఇండియా ఆక్సిలియరీ ఫోర్సు సభ్యులుకూడ రిజర్వుశాఖలో కమిషను ఉద్యోగులు కావచ్చును. రిజర్వు ఉద్యోగులకు సాలియానా రు ౨౦౦-౦-౦ విరాళమిచ్చెదరు. క్రమముగ సేవలో చేరినప్పుడు దుస్తుల అలవెన్సుక్రింద రు ౪౦౦-౦-౦ ఇచ్చెదరు, ౧౯౩౪ జనవరి ౧ వ తేదినాటికి ఇండియాలోని రిజర్వు ఉద్యోగులసంఖ్య ౧౩౯౮. సిలోనులోకూడరిజర్వు అధికారులను ౫౦ వఱకు చేర్చుకొనుటకు అధికార మిచ్చిరి.

# శ్రీ దుర్గాపూజ – పశుబలిదానము

శ్రీ పండిత మదనమోహన మాలవ్యగారు

శాస్త్రవాక్యముల కొన్నింటి నాధారముగా తీసికొని పశుబలికి విరోధముగా పల్కుట కనుచితముగా నున్నను, శాస్త్రవిధానమును వ్యతిరేకింప ఇష్టములేకపోయినను, పశుబలి లేక పూజా విధానము పూర్తికాదని తలంచినను, అట్టి వారొక్కటి ఆలోచింపవలసియున్నది. శ్రాద్ధాది కర్మలలో మాంసాహారము పెట్టవలెననియున్నను నేడది పాపముగా పరిగణింపబడుచున్నది. అందుచేత మాంసమును ఉపయోగించుటయే లేదు. మాంసములేకున్నను శ్రాద్ధకర్మ సుసంపన్నమగుచున్నదని పల్కునప్పుడు బలిలేకున్నను నవరాత్రిదిపూజలును సుసంపన్నములే అగును. అదియునుగాక కూష్మాండాదులచే స్పష్టముగా బలి విధానము లిఖింపబడి, ప్రచారములో కూడ ఉన్నది. ఇందులకు సైతము సమ్మతింపనిచో, శాస్త్రాధారమునను సరించి దేవతను సంతోషపెట్టుటకై అసహాయ నిరపాయపశువుల తలలు నరకుటకంటె తనరక్తమునుగాని శార్దూలమునుగాని బలియిచ్చుటకు సిద్ధపడుటమంచిది. కల్కి పురాణము వీనినిబలిద్రవ్యములుగా పేర్కొనినది:

"శార్దూలశ్చనరాశ్చైవ స్వగాత్రరుధిరంతథా"

కాని శాస్త్రవిధానములను పూర్తిగా రక్షించుటకై ఈవిధముగా బలియొసంగు భక్తాగ్రేసరుడు కనిపింపడు. నరబలియొసంగుటకాని తన రక్తమును బలియిచ్చుటగాని సామాన్యమైన పనికాదు. "నరబలికలియుగమున వర్జింపబడెను" అని చెప్పవచ్చును. అయిన తనరక్తమిచ్చుటకు అభ్యంతరము లేదుకదా? దానిని ఏల ఇచ్చుట లేదు?

దేవీభాగవతమున తృతీయ స్కంధములో ౨౯ వ అధ్యాయమున నవరాత్రి విధానమును విపులముగా వ్రాయునపుడు పశుబలి అత్యావశ్యకమని లేదు......."పశుబలి యొసర్చి మాంసమును తీయుటకు బదులుగా 'పురోడాశ' యజ్ఞమును చేయవలెను" అని కూడకలదు. పురోడాశ మనగా పిండితో తయారుచేసి ఆహుతిచేయబడురొట్టె. పశుహింస మాన్పుటకే ఈమార్పు చేయబడెను. కాబట్టి మీరుకూడ పురోడాశయజ్ఞమును చేయవచ్చును.

"పశుహీనాః కృతాయజ్ఞా పురోడాశా దిభిఃకిల."

(దే. భా. ౧-౨)

సాత్త్వికయజ్ఞము దుర్లభమైనదనియు దాని వలననే దేవి కానవచ్చుననియుచెప్పి పురోడాశమే ముఖ్యమై, అధికశ్రద్ధతో కూడినదై, పశువులను బంధించు యూపములులేనిదై, మంత్రపూర్వకమైనయజ్ఞమే సాత్త్వికయజ్ఞమని వ్యాసుడు నిర్ణయించి జనమేజయునితో అదే చేయుమని చెప్పెను.

"సాత్త్వికస్తు మహారాజ!
దుర్లభో వై మఖః స్మృతః"
"సర్వభూతస్థ మాత్మానం
సర్వభూతాని చాత్మని
యదా పశ్యతి భూతాత్మా
తదా పశ్యతి తాం శివాం"
"పురోడాశపరా నిత్యం
వియూపా మంత్రపూర్వకాః
శ్రద్ధాధికా మఖా రాజన్
సాత్త్వికాః పరమాః స్మృతాః".

మాంసభక్షణము విడిచిపెట్టవలెననియే మనువు శాసించియున్నాడు. పురాణములందు బలికర్మను మాంసభక్షణమును త్యజింపవలెననియే స్పష్టముగా వ్రాయబడియున్నది. పద్మపురాణమునందలి పద్మోత్తరఖండమున పార్వతి పరమేశ్వరునితో ఇట్లు చెప్పినట్లు కలదు. "ఎవ్వరు నాపూజకొరకని ప్రాణిహింస చేయుదురో అట్టి వారిపూజ అపవిత్రము ; ఆదోషమువలన వారికి అధోగతివచ్చును. నాకొఱకు పశువధచేయు తామసులు కల్పకోటిపర్యంతము నరకములో బాధపడుదురు. పశువును కట్టివేసి, దానిని నరకి నెత్తురు బురద చేయువాడు నరక మనుభవింపనిచో నరకమునకు వెళ్లువాడు మరియెవడు? ఎవడు నాపేర పశువునువధించి దానిమాంసమును బంధువులతో తినునో అట్టివాడు ఆపశువున కెన్ని రోమములున్నవో అన్ని యేండ్లు 'అసిపత్ర' నరకమును అనుభవించును. మన యిరువురికొరకుపశుబలియిచ్చువారు సూర్యచంద్రు లున్నంతవరకు నరక మనుభవింపవలసినదే. వేదాజ్ఞచే స్వర్గము కోరి యజ్ఞము చేసినవాడు స్వర్గసుఖ మనుభవించినను, తిరిగి సంసారసముద్రమున పడవలసినదే.

"యే మ మార్చన మి త్యక్త్వా
ప్రాణిహింసనతత్పరాః
తత్పూజనం మ మామేధ్యం
యద్దోషా త్తదధోగతిః.
మదర్థే శివ! కుర్వన్తి
తామసా జీవఘాతనమ్
ఆకల్పకోటి నిరయే
తేషాం వాసో న సంశయః.
యూపే బద్ధ్వా పశూన్ హత్వా
యః కుర్యా ద్రక్తకర్దమమ్
తేన చే త్ప్రాప్యతే స్వర్గో
నరకః కేన గమ్యతే?
మద్వ్యాజేన పశూన్ హత్వా
యో భక్షే త్సహబంధుభిః
తద్గాత్రలోమసంఖ్యాకై
రసిపత్రవనే వసేత్.
పశూన్ హత్వా తథా త్వాం మాం
యో ర్చయే ద్మాంసశోణితైః
తావ త్తన్నరకే వాసో
యావచ్చంద్రదివాకరా.
స్వర్గకామో శ్వమేధేన
యః కుర్యా న్నిగమాజ్ఞయా
తద్భోగా న్తే పతే ద్భూయః
స జన్మాని భవార్ణవే."

ఇదేవిధముగా మహాభారతమున శాంతిపర్వమందలి ౨౬౪ వ అధ్యాయములో హింసాకర్మ కూడదని వ్రాసియున్నది. ఈ ఉపదేశమునే ధర్మాత్మమునికూడ చేసియున్నాడు.

"తస్మా త్ప్రమాణతః కార్యో
ధర్మః సూక్ష్మో విజానతా
అహింసా సర్వభూతేభ్యో
ధర్మేభ్యో జ్యాయసీ మతా."

[దక్షిణభారతజీవరక్షణ ప్రచారసభవారు ప్రకటించిన పత్రమునుండి.]

ప్రకృతి - బెజవాడ

ఆరోగ్యవిషయిక సచిత్ర వైద్యమాసపత్రిక.

మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట, రోగములు రాకుండుట, నీరు, గాలి, మట్టి, సూర్యకిరణ, స్వాభావికాహార, యోగవ్యాయామ, ఉపవాస, విద్యుత్కాంతిశక్తి మొదలగువాని సహాయమున రోగములను కుదుర్చువిధానములను తెలుపును. చందాదారులకు ప్రకృతివైద్యపుస్తకములన్నియు తగ్గింపుధరల కియ్యబడును. చందా రు. ౩లు.

17

# లాహోరు కంటోన్మెంటు రాకాసి కమేలా

శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు

లాహోరు కంటోన్మెంటులో పెద్ద కమేలా కట్టుటకు మొదలుపెట్టుట తెలిసి, పంజాబు రాష్ట్రములోని వివిధ భాగములలో నున్న ప్రజలు—హిందువులును, సిక్కులును మాత్రము కాక మహమ్మదీయులుకూడ—దానిపని మాని వేయవలెనని సభలును, హరతాళములును చేసిరి. కాని, భారతప్రభుత్వమువారు ఇది కట్టక తప్ప దనియు, దీనివలన ఎన్నో మేళ్లు కలుగుననియు కూడ వింతవాదము ప్రకటించిరి. అయినను, ప్రజలు ఆందోళనము మానలేదు. పంజాబు రాష్ట్రమువారే కాక, ఇండియాలోని తక్కిన రాష్ట్రముల ప్రజలును, ప్రజానాయకులును ఈ వధశాల కట్టరాదని పంజాబు ప్రభుత్వమువారి కిని, ఇండియా ప్రభుత్వమువారికిని గట్టిగా తమ అభిప్రాయమును తెలిపిరి. భారతశాసన సభా సభ్యులగు భాయి పరమానంద మొదలగువారు దీనినిగూర్చి రాజప్రతినిధిగారి దగ్గఱకు రాయ బారము వెళ్ళిరి; లాభములేదను కారణము చెప్పి, వారితో ఆయన మాటలాడుటకుకూడ నిరాక రించెను. అందువలన ఆందోళనము మఱింత హెచ్చినది. రాజప్రతినిధిగారికి మొఱ్ఱలు హె చ్చుగా చేరినవి. పశుపోషణమో ! పశుపోష ణమో ! అని ఘోషపెట్టు లిన్‌లిత్‌గో ప్రభువు గారికి అగ్నిపరీక్ష వచ్చినది ! ఆయన సిద్ధాంత మును ఎట్లు నిలువఁ బెట్టుకొందురో చూడవలె నని ఇండియావా రందఱును ఆతురపడుచుండిరి. ఇట్టి విషమస్థితి కనిపెట్టి రాజప్రతినిధిగారు, బా గుగా ఆలోచించి, ప్రజలకు పై కమేలాపని మానుటవలన రు ౧౫౦ లక్షలు నష్టమువచ్చునని తెలుపుచు, ప్రజలలో హెచ్చుమంది దీనికి విరు ద్ధముగా ఉండుటచే తమ ప్రభుత్వమువారు దీని పని మానివేయుటకు నిశ్చయించినట్లు ప్రకటించి నారు; తమకు వచ్చినపరీక్షలో నెగ్గినారు. ఇందు లకు, లిన్‌లిత్‌గో ప్రభువుగారిని భారతీయు లందఱును హృదయపూర్వకముగా అభినందింప నగును. దీనియందువలెనే మన రాజప్రతినిధి గారు ప్రజాభిప్రాయమును పాటించి, భరతఖండ మునకు మేలొనర్చి, స్థిరతరసత్కీర్తి పొందె దరుగాక !

ద్వితీయ ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్యమహాసభ,
కాకినాడ.

(1937 సం॥ అక్టోబరుమాసములో జరుపబడును)

## ప్రత్యేకవిజ్ఞప్తి

జీవదయాపరులగు సోదరసోదరీమణులారా !

(1) జంతుబలి, మాంసాహారము, మద్య పానము, జీవహింసలు మాన్పించుట. (2) పశు

---

## ఆంధ్రదేశ వయోజన విద్యామహాసభ

ది ౨౫-౯-౩౭ తేదీని చాగల్లు రైలుస్టేషనుదగ్గఱి 'ఆనందనికేతనాశ్రమము' లో జరుగును.

శ్రీ జే. సి. కుమారప్పగారు-సభాప్రారంభకులు.

డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యపంతులుగారు సభాధ్యక్షులు.

సంరక్షణ (3) దీనజనోద్ధరణము, (4) దైవభక్తి, విద్య, ఆరోగ్యములను బెంపొందించుట, మొదలగు మత, సాంఘిక, ఆర్థికాభివృద్ధులకొరకై కాకినాడలో రానున్న అక్టోబరు మాసములో శ్రీ బొంబాయి జీవదయామండలివారి యాజమాన్యమున ద్వితీయ ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య మహాసభ జరుపబడును. ఇదివరకు సోంపేటలో విశాఖమండల జీవకారుణ్యసంఘ యాజమాన్యమున ప్రథమ సమావేశము జరిగి యీ యుద్యమమునకు కొంతబలము గలిగినది. త్వరలో నీ ద్వితీయ మహాసభ యొక్క నియమావళి, కార్యక్రమ, ఆహ్వానపత్రికలు, మొదలగునవి పంపనున్నారము. కావున పై యుద్దేశములతో ఆంధ్రరాష్ట్రమున గృషిసల్పుచున్న జీవకారుణ్య సంఘములు, ఇతర సత్సంస్థలు, అభిమానులు ఈ మహాసభావశ్యకతను, ప్రాముఖ్యతను గుర్తెరింగి ఈ క్రిందివిధాన మనుసరించి యథోచితముగ నీ సత్కార్యమున బాల్గొని జయప్రదము గావించి, ఇహపరసౌఖ్యముల జెంద ప్రార్థితులు.

(1) ప్రతినిధుల బంపుట.

(2) ఉచితరీతిని ధనసహాయముచేయుట.

(3) ఉపన్యాసములు, వ్యాసరచనలు, ప్రదర్శనములు మొ॥ జరిగించుట.

(4) వాలంటీర్లుగా పనిచేయుట.

(5) చిత్తుతీర్మానములు, సలహాలను నివేదికలనుబంపుట. ఇతర అవసరసహాయములు చేయుట.

శ్రీ బొంబాయి జీవదయామండలి తరఫున

జోశ్యభట్ల సత్యనారాయణ,
అం॥రా॥జీ॥ కారుణ్యసంఘ ప్ర॥కార్యదర్శి,
అండ్ ఆర్గనైజరు, సోంపేట.

శ్రీ సుజనసమాజము, (రిజిస్టర్డు)
అనకాపల్లి.

# అమ్మవారిపండుగ

(బలిఆపబడెను.)

ది ౨౫-౫-౩౭ తేదీని మాగ్రామమున దుర్గమాంబ జాతర జరిగినది. ఈ పండుగ దినమున అనకాపల్లి రిజస్టర్డు సుజనసమాజ ప్రచారకులు, మ॥రా॥ శ్రీ వేలం వెంకటరమణగారు, మోల్మెన్ సుజనసమాజఉపాధ్యక్షులగు మ॥రా॥శ్రీ బొండా మునిస్వామినాయుడుగారితో కలిసివచ్చి, గొటివాడలోను బొండావానిపాలెములోను పండుగ చేయు పెద్దలనందరిని కలిసికొని, జీవహింస కూడదని ఉపన్యాసములవలనను, కరపత్రముల మూలముననుప్రజలందరికి తెలియజేసిరి. సాయంకాలము గ్రామస్థులందరును మేకపోతును తీసికొని అమ్మవారి గుడియొద్దకు బయలుదేరిరి. అమ్మవారికి బలివేయదలచిన యీ మేకను ఊరంతా త్రిప్పి ౭ గంటలకు గుడియొద్దకు తీసికొని వెళ్లిరి. అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి ధూపదీపనైవేద్యములతో పూజచేసిరి. ఈసమయమున మేకపోతును నరుకదలచిన కత్తిని మ॥ రా॥ శ్రీ బొండా అచ్చన్నాయుడుగారు తీసికొని ఆకత్తితో కొబ్బరికాయను ఒలిచి అమ్మవారికి సమర్పించిరి. పిమ్మట స్థానిక జీవకారుణ్య సంఘ అధ్యక్షులగు మ॥ రా॥ శ్రీ లగిశెట్టి అప్పలస్వామినాయుడుగారు ఆ మేకపోతును రెండుచేతులతోను పైకియెత్తి దుర్గాదేవిని ఇట్లు సంబోధించిరి. "తల్లీ దుర్గా! నీవు లోకమాతవుగదా! సమస్తజీవులము నీబిడ్డలముగదా! ఎన్నడు నీవు బలిని కోరవు. కాన మేము ఈ మేకపిల్లను చంపము. నీకు తినవలెనని కోరికయున్న యెడల నీవే చంపుకొని తినగల"వని ఆ మేకపిల్లను గుడిలోనుంచి తలుపువేసి వెళ్లిపోయిరి. మరుచటిదినము

ఉదయము ఊరిపెద్దలందరు గుడిలోనికి వెళ్ళి చూడగా ఆమేకపిల్ల సజీవమై కులాసగ ఉన్నది. ప్రజలందరును ఈనిదర్శనమువలన అమ్మవారు రక్తముత్రాగు రాక్షసి, పీనుగులు తిను పిశాచి కాదని గ్రహించి యింకెన్నడు అమ్మవారిపేరున జంతుబలులను వేయమని నిర్ధారణచేసికొనిరి. ఈగ్రామముదగ్గర భీమవరములోకూడ బంగారమ్మపండుగలో ఎనుబోతు బలివేయదలచిరి. పై ప్రచారకులు మ॥ రా॥ శ్రీ వేలం వెంకటరమణగారును, మ॥ రా॥ శ్రీ బొండా మునిస్వామి నాయుడుగారును, గ్రామకరణముగారగు మ॥రా॥శ్రీ కాట్రేని కోన సుబ్బారావు పంతులుగారును, స్థానికజీవకారుణ్యసంఘమువారును, ఆగ్రామమునకు వెళ్లి, గొటివాడగ్రామమునజరిగిన మేకబలి నిషేధమునుగూర్చి చెప్పగ, వారిగ్రామమున జరుగబోవు ఎనుపోతుబలినికూడ మ॥ రా॥ శ్రీ కొప్పాక సత్యనారాయణ (కరణము) రామునాయుడుగార్లు నిలిపివేసిరి.

గొటివాడ,<br>అనకాపల్లి తాలూకా,<br>౨౭-౫-౧౯3౭.

ఇట్లు,<br>దువ్వూరి అచ్చుతం,<br>జీవకారుణ్యసంఘకార్యదర్శి.

ది 30—౮—3౭ తేదీని అమృతసరస్సునగరమున గోవధశాలలవలన పశువులు తగ్గిపోయి ఆర్థికనష్టము కలుగుచున్నదికావున అవి తీసివేయించుటనుగూర్చి ప్రయత్నించుటకు గొప్ప బహిరంగసభ జరిగెను. రాష్ట్రీయసభ త్వరలో జరుపవలెనని కోరిరి.

లాహోరు కంటోన్మెంటులో నిర్మించు గోవధశాలకు ప్రతికూలముగా రాష్ట్రములో ప్రచారము జరుగుచుండుటచేత ఆశాల కట్టుచున్నపనివారు 300 మంది హిందువులును, సిక్కులును, మహమ్మదీయులును తమపనులు మానివేసి వెళ్ళిపోయిరి.

ది ౫—౯—3౭ తారీఖున చెన్నపురిలో జరిగిన చెన్ననగరపు 3 వ రాజకీయ మహాసభలో “మతముపేర గుడులయెదుట జరుగుచున్న జంతుబలులు మొదలగు జీవహింసా కార్యములను ఆపుటకు (మద్రాసు) మంత్రివర్గమువారు వెంటనే శ్రద్ధతీసికొనవలయునని ఈసభవారు కోరుచున్నారు” అని తీర్మానించినారు.

ప్రధానమంత్రిగారే ఈమహాసభకు ప్రారంభోత్సవము జరిపిరి. ఆయన దీనినిగూర్చి తగు శ్రద్ధ తీసికొందురుగాక!

లాహోరు కంటోన్మెంటులో కమేలా కట్టుట ఆఁపవలెనని అమృతసరము, రావల్పిండి, జలంధరు, లయల్‌పూరు, గుజరన్‌వాలా, ముల్తాను, లూధియానా, సిమ్లా, మైలాసీ, కాడియను, గుజరాతు, హోషియాపురము, సియాల్‌కోట, కంగ్రాలలో హరతాళములు జరిగినవఁట!

ప్రణిధాయజ్ఞాన ప్రచారణ సంఘమువారు మైసూరు సంస్థానములోని దవనగిరినుండి “పశుజాతి తగ్గిపోవుట వ్యవసాయమునకు నష్టము. వధశాలల నిర్మించుట హిందువుల పూజాభావమునకు విరుద్ధము. వధశాలల లైసెన్సు రద్దుచేయించి గోమాతను రక్షింపుడు” అని గాంధిమహాత్మునకు తంతివార్త పంపిరి.

గుంటూరులో కలరా దేవతను తృప్తిపఱుచుటకు జంతుబలులిచ్చి జాతరలు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నట్లు తెలిసి, జీవహింస కూడదని జీవకారుణ్య సంఘములవారును తక్కిన భూతదయాపరులును ప్రచారము చేయుచున్నారు. వారిప్రబోధమువలన మనస్సు కరఁగి జంతుబలు లీయఁదలఁచుకొన్నవారు అవి మానెదరుగాక!

లాహోరుకమేలాను కట్టవలెనను ఇండియా ప్రభుత్వమువారినిశ్చయమునకు పంజాబుప్రభుత్వము తానును అంగీకరించినట్లు ప్రకటించెను. కమేలాప్రతికూలసంఘకార్యదర్శి పంజాబుప్రభుత్వమువారికి వారి వైఖరి మార్చుకొనవలెనని యు, ప్రత్యుత్తరము వెంటనే తెలుపవలెననియు, తంతివార్త యిచ్చెను.

గాంధిమహాత్ముని అభిప్రాయము

జంతువులనుచంపు కమేలాలు కట్టుట నా కిష్టముకాదు. కాన లాహోరుకమేలా కట్టుటకు నేను ప్రతికూలుడ ననుటకు సందేహమేమియు లేదు. మహమ్మదీయులుకూడ తోడ్పడినచో లాహోరులో కమేలా కట్టుటకు వీలుకాదు.

చిత్తూరులో ది ౧౪-౯-32 తేదీని సమావేశమైన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసంఘసభలో "దేశములో జాతరలు మొదలగునవి జరపి జంతుబలు లిచ్చుట అహింసాధర్మమునకు విరుద్ధముకాన అట్టి జాతరలను మానుటకు ప్రజలను హెచ్చరించుచు అందులకు తగినప్రయత్నములు చేయవలెనని కాంగ్రెసువాదులను కోరుచున్నారు" అను తీర్మానము చేసిరి.

లాహోరు కమేలా కట్టరాదని తెలుపుటకు భాయిపరమానంద, ఆనే, అఖిలచంద్రదత్తు, సర్దారు శాంతసింగుగార్లు రాజప్రతినిధిగారి దగ్గఱకు వెళ్ళఁగా, ఆయన లాభములేదని వారితో మాటలాడుటకు నిరాకరించెను.

---

# ఆంధ్రరాష్ట్రజీవకారుణ్యసంఘము, బెజవాడ.

## ప్రకటనము

ఆంధ్రరాష్ట్రమందలి జీవకారుణ్యసంఘముల వారికిని, తెనుఁగువారిపెద్దఱికమున నడచు తక్కినచోట్ల పనిచేయు జీవకారుణ్యసంఘముల వారికిని, జీవకారుణ్యవిషయములనుగూర్చికూడ శ్రద్ధవహించి ప్రకటించుచున్న "గ్రంథాలయసర్వస్వము" అను పత్త్రికను తగినంత కాలము చందా కోరకయే పంపించుటకు ఆప త్రికాప్రకటనోపసంఘమువారితో ఏర్పాటుచేసితిమి. కావున, ఆయాచోట్ల జీవకారుణ్యసంఘములుపెట్టి పని చేయుచున్నవారు తమ సంఘములనుగూర్చి మాకు తెలుపఁగోరెదము. మాకు తెలిసినసంఘములకును, జీవదయాపరులగు వ్యక్తులకును ఇదివఱకే గ్రంథాలయ సర్వస్వము పంపుచున్నాము. మేము పంపిన పత్రిక కైకొనినవారు అందినట్లు మాకు తెలుప వలయును. వారు తమరు చేయుపనినిగూర్చి తెలిపినయెడల గ్రంథాలయసర్వస్వమున ప్రకటింపఁజేయుదుము; తగినవ్యాసములు పంపినచో అవియు వెల్లడింపనొనర్తుము. చందా లేకయే పత్రికను స్వీకరించినవారు కొంతకాలమున కైనను చందాచెల్లింతురని ఆశింతుము. అటుజరిగిన యెడల ఊరకే పంపుటకు నిర్ణయించిన కాలము ముగిసినపిదపకూడ పత్రిక ఎడతెగకవచ్చుటకు వీలు కలుగును. పత్రికకైకొను జీవకారుణ్య సంఘ

ములవారిచ్చుచుండా, బెజవాడలోని ఆంధ్రరాష్ట్రజీవకారుణ్యసంఘమునకు అనుబంధ సంఘములుగా చేరుట కిచ్చు వార్షికపు రుసుముగా గ్రహించి, అది ఇచ్చినవారికి గ్రంథాలయ సర్వస్వమును మాత్రముకాక మాసంఘమువారు ప్రకటించుజీవకారుణ్య వాఙ్మయముకూడ అప్పుడప్పుడు పంపుచుందుము. ఇందువలన జీవకారుణ్యసంఘములకు ఎంతో మేలు కలుగును.

కాఁబట్టి, తెనుఁగుమాటలాడు అన్నిచోట్లను పనిచేయు జీవకారుణ్యసంఘములవారందఱును, మే మిచ్చినఅవకాశమును వినియోగించుకొని, తాము మేలు పొందుటతోపాటు మాకును తోడ్పడి, జీవకారుణ్యోద్యమము తెనుఁగునాట నంతను సఫలమగునట్లు చేయుటయే కాక, తక్కిన భాషలుమాటలాడు రాష్ట్రములలో పనిచేయు జీవకారుణ్యసంఘములకుకూడ తోడ్పడుస్థితికి మనము వచ్చునట్లు చేసి, తెనుఁగునాటికి పేరు తెచ్చెదరని కోరుచున్నాము.

గాంధివిలాసము, గవర్నరుపేట, బెజవాడ. } మారేపల్లి రామచంద్రశాస్త్రి.

---

# గ్రంథాలయసర్వస్వమునకు అనుబంధము

## గ్రామోద్యోగపత్రిక

[అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘమువారు ప్రకటించు ఈ పత్రిక శ్రీయుత గొల్లపూడి సీతారామశాస్త్రిగారు మా పక్షమున కోరఁగా, వారు దీనిని మాపత్రికకు అనుబంధముగా ప్రకటింప అనుమతి ఇచ్చిరి. ఇందులకు శ్రీ శాస్త్రిగారికిని సంఘమువారికిని మే మెంతయు కృతజ్ఞులము. సంపాదకులు].

సంపుటము ౧ ౧౯32 జూలై సంచిక ౧

అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘమును స్థాపించి ఇప్పటికి రెండు సంవత్సరములు దాఁటినది. ఈ సంఘముయొక్క సేవకులును, సభ్యులును దేశమం దంతటను ఉన్నారు. దీనికి సంబంధించినవారి కందఱకు దీనియాజమాన్యమున జరుగుచున్న కృషివివరములను తెలుపుచుండుటకును, వ్యాసములవలన దీని ఉద్దేశములను లక్ష్యములను వ్యాప్తి చేయుటకును, గ్రామ పునర్నిర్మాణోద్యమములో ఈ సంస్థకు సంబంధించినవారికి సహకారిగ నుండుటకును, అప్పుడప్పుడు ఒకపత్రిక ప్రకటించుట అవసరమని గుర్తించితిమి. ఈ పత్రిక మా సంస్థకు ప్రకటన సాధనముగ ఉండఁగలదు. గ్రామపారిశుద్ధ్యము, ఆరోగ్యము ఆహారము, గ్రామపరిశ్రమలు మొదలగు గ్రామసేవకుల కుపయోగించు విషయములను గుఱించి వ్రాయఁదలచు సభ్యులుగాని తదితరులుగాని ఈ పత్రికను ఉపయోగించుకొన వచ్చును. దీనివలన ఒకరి అనుభవములను ఒకరికి ధారాళముగ తెలుపుచుండుటవలననే ఈ పత్రిక బలిష్ఠమగు ప్రకటన సాధనమై సార్థకతను పొందఁగలదు.

### కేంద్రస్థానమందు జరుగుచున్న పనులు

కేంద్రకార్యాలయపు దినచర్యగాక కేంద్రకార్యస్థానమందు ఇతర పారిశ్రామిక శాఖలు అనేకములు పనిచేయుచున్నవి. ఇవి కృషికొఱకును పరిశోధనములకొఱకును ఏర్పడినవి:

•తేనెటీగలను తేనెకొఱకు పెంచుట; నూనెగానుగ ఆడుట; పాడిపని; బెల్లము తయారు

చేయుట; కాగితములు చేయుట; ఏకుట; నూలు వడుకుట; వ్యవసాయము; వడ్లు విసరుట.

ఈ పరిశ్రమలు నేర్పుటకును, పారిశుద్ధ్యము ఆరోగ్యము, ఆహారము, లెక్కలువ్రాయుట, గ్రామోద్యమ ప్రధానసూత్రములు మొదలగు నవి నేర్పుటకును, శిక్షణనిలయము కూడ కలదు.

*  *  *  *

నివేదికలు

సభ్యులును, ఏజంట్లును తమ తమ నివేదికలు పంపుటకు జాగుచేసి, పెక్కురు తమ సభ్యత్వమును పోఁగొట్టుకొనినారు. కావున, సభ్యులును ఏజంట్లును తమ తమ నివేదికలను తప్పక పంపుచుండుట విధి యని భావింతురుగాక!

[రెండవసంచికలోని విషయములు అక్టోబరు సంచికలో వచ్చును.]

---

సంపుటము ౧ సెప్టెంబరు ౧౯౩౨ సంచిక ౩

## నూనెగానుగ

మన దేశములో వివిధ ప్రాంతములలో ఎద్దులు లాగు నూనెగానుగలు కలవు. వానిలో ఒండొంటికి ఎంతో వ్యత్యాస ముండును. ఒక రాష్ట్రములో ఉపయోగించు గానుగలలో కూడ ఇట్టి వ్యత్యాసము కాన నగును. పలురకముల గానుగలపై పనిచేసి పరిశోధనములు సలిపితిమి. నూనెగానుగయొక్క శ్రేష్ఠత్వమును నిర్ణయించుటలో ఈ దిగువ అంశములు దృష్టియందుంచుకొని పరీక్షించితిమి.

౧ నూనెదిగుబడి హెచ్చుగా నుండవలెను. ౨ తక్కువకాలములో ఎక్కువపని జరుగవలెను. ౩ గానుగ ఎక్కువగింజలు పట్టదగినంత పెద్దదిగా ఉండవలెను. ౪ పనిచేయువానికి గాని ఎద్దుకు గాని సాధ్యమైనంత తక్కువ శ్రమతో పని జరుగవలెను.

పనిచేసి చూచిన గానుగలు

ఈ దిగువ గానుగలపై మేము పనిచేసి పరిశోధించితిమి. ౧ ఈ ప్రాంతములో ఉపయోగించు వరాడిగానుగ. ౨ పంజాబుగానుగ. ౩ గుజరాతుగానుగ. మొదటిదానిలో లోపములనేకము లున్నవి. రెండవదానిలో పైని తెలిపిన ౨-౩ అంశములవిషయములో లోపము లున్నవి. మూడవదానిలో పైని తెలిపిన ౪ వ అంశము విషయములో లోపమున్నది. పంజాబుగానుగలు రెండింటిపై ఒకడే ఏకకాలమందు పనిచేయగలడు. గుజరాతుగానుగ ఒక్కదానిపై ఒకడు ప్రత్యేకముగ ఉండవలెను.

పరీక్షించిన గానుగలు

పై గానుగలపై పనిచేయుటయేగాక దక్షిణదేశపు గానుగలను మార్వారుదేశపు గానుగలను వానిని ఉపయోగించు ప్రదేశములకు వెళ్ళి పరీక్షించితిమి. ఇతరలోపము లట్లుండ దక్షిణదేశపు గానుగలలో ప్రధానమగు లోపము ఒకటి కనిపించినది. గానుగతిరుగు మధ్యగుంట మరమ్మతులకు వీలగునట్లు ఆయాభాగములు విడివిడిగా ఉండక మొత్తము ఏకాండపుకొయ్య చట్రమునే గుంటగా ఉపయోగించుటవలన ఆచట్రము అరిగి ౪,౫ ఏండ్లలోనే పారవేయవలసివచ్చుచున్నది. మార్వారు గానుగయొక్క గుంటలో కొద్దిమార్పులు చేయుట అవసరము. అంతేకాని మొత్తముమీద ఈగానుగే అన్ని విధముల తృప్తికరముగ నున్నది.

అభివృద్ధికిగాను చేసినమార్పులు

మాఅనుభవమునుబట్టి ఒకేగానుగలో వివిధములగు గానుగలలో నున్న సుగుణములను చేర్పుటకు ప్రయత్నించుచున్నాము. అందుకొఱకు పంజాబు గానుగలో ఈ దిగువమార్పులు చేసినాము.

౧. గానుగగుంట ఎక్కువ గింజలు పట్టుటకై పెద్దదిగా చేసితిమి. ౨ గుంటయొక్క పక్క భాగమును గుండ్రముగా గాక నిలువుగా ఉండునట్లు చేసితిమి. ఇందువలన మధ్యతిరుగు ఇరుసు గుంటకు అన్ని వైపులను ఒత్తుకొనుచు గింజలు త్వరలో బాగుగా నలుగుటకు వీలగును. 3 గుంట యొక్క పక్కభాగము కేవలము నిలువుగా ఉంచక ఎక్కువ వాలునట్లు చేసితిమి. ఇందువలన ఎద్దుకు అదనపుశ్రమ లేకయే గింజలకు ఇరుసు వలన ఎక్కువ ఒత్తిడి తగులగలదు. ౪ గుంటలో గాళ్ళు ఏర్పరిచితిమి. ఇందువలన గింజలు వేగముగాను బాగుగాను నలుగును. ౫ ఒత్తిడిని అధికము చేయుటకుగాను ఇరుసుయొక్క పొడుగును పెంచితిమి. ౬ నూనె క్రిందికి బాగుగా జారుటకు గాను గొట్టమును వంకరలేకుండ చేసితిమి.

ఫలితములు హెచ్చుగా ఉండునని ఆశించుచున్నాము. యోగ్యమని మేము నిర్ణయించిన నూనెగానుగయొక్క సరియైన వివరములును, కొలతలును, ప్రతిమయు వ్రాసి పంపుడని చాల మంది వ్రాసిరి. కొద్దిరోజులలోనే నూనెగానుగలను గురించి ఒక ప్రత్యేక కరపత్రమును ప్రకటింపదలచితిమి. అందులో అవసరమగు వివరములెల్లను ఉదాహరింపగలము. కరపత్రము తయారు కాగానే ఈ పత్రికలో ప్రకటింతుము. అప్పుడు వలయువారు ఒక ప్రతిని తెప్పించుకొనవచ్చును.

### నూనెదిగుబడి

రెండు గానుగలపై ఏకకాలమందు ఒకడు రెండు ఎడ్లతో రోజు ౧కి ౧౦ గానుగలు (పట్లు) నువ్వులను ఆడుచున్నాడు. పట్టు ౧కి ౧౬ పౌనులు ప్రమాణము; నూనె దిగుబడి ౭౦ పౌనులు; అనగా నూటికి ౪౪ వంతులు. ఒక్కొక్కపట్టుకు ౧ గంటకాలము పట్టుచున్నది. అవిసెగింజలు ఇదివరలో ఒక్కగానుగ ఆడుటకు 3 గంటలు పట్టెడిది; ఇప్పుడు ౧ గంటమాత్రమే పట్టుచున్నది. దీని నూనెదిగుబడి నూటికి సుమారు 33 వంతులు.

### ఇపుడు చేయుచున్న ప్రయోగములు

నువ్వులు గానుగ ఆడునప్పుడు బెల్లమును చేర్చెదము. ఇందువలన గింజలు వేగముగ నలిగి పిండి అట్టగా తయారగును. అవిసెగింజలు చాల గట్టిగా ఉండును. అందుచేత గానుగలో వేయుటకు పూర్వము వీనిని నలగగొట్టుదుము.

జవేర్ భాయి పి. పటేల్.

### తెలకపిండి

నూనెతీయు వివిధములగు గింజలకు వేర్వేరు రకముల గానుగులపై నూనె దిగుబడి ఎంత వచ్చునదియు తెలిసికొనుటకుగాను ఆ యా తెలకపిండి అట్టలలో ఎంతనూనె ఉండిపోయినదో పరీక్షింప దలచితిమి. దీనికి మొదట పిండి వచ్చిన గింజలలో నూనె ఎంత ఉన్నదో తెలిసికొనుట అవసరము. కనుక మాదిరికి పంపువారు ఒక అరపౌను తెలకపిండియు ఒక అరపౌను ఆ పిండి వచ్చిన గింజలును పంపకోరుచున్నాము. పిండిని రేకుడబ్బాలో పంపవలెను.

### షార్కు చేపనూనె (షార్కు లీవర్ ఆయిల్)

కన్యాకుమారిఅగ్రములో చేపలుపట్టువారు 'షార్కులు' అను సముద్రపు చేపలనుండి 'షార్కులీవర్ ఆయిల్' అను చేపనూనెను తయారు చేసిరి. మా సూచనప్రకారము ఈ నూనె శాస్త్రీయమగు పద్ధతులలో పరీక్షించిరి. 'ఏ' జీవాణువులలో (విటమినులలో) కాడ్లీవరు ఆయిలుకు సమానముగ ఉన్నట్లు తెలిసినది.

ఆహారముగ ఉపయోగించినమీదట కూడ ఇందులో కాడ్లీవర్ ఆయిల్లో గల 'ఏ' విటమినుశక్తిలో ౨/3 వంతు లున్నట్లు తేలినది.

ఇది ధరలో చాల చవుక. రోగులు దీనిని ఉపయోగింపగా కాడ్‌లీవర్ ఆయిల్ కంటె ఎక్కువ కాకపోయినను దానంత గుణ మిచ్చినది. ఈ విషయములను గురించి మేము మా ౧౯౩౬ సంవత్సరపు నివేదికలో వ్రాసియున్నాము. దానిపై ఇది ఎక్కడ దొరకునదియు, దీని ఖరీదును, వాడవలసినవిధానమును, తెలియజేయవలసినదని పెక్కురు ఉత్తరమును వ్రాసినారు. ఇందునుగురించి డాక్టరు ఎమ్. ఇ. నాయుడుగారు (హరిజన సేవకసంఘము, కొట్టారు, తిరువాన్కూరు) మాకు పంపిన వివరములను దిగువ పొందుపరచుచున్నాము. కిరోసిన్ డబ్బాలో పట్టినంత నూనెఖరీదు రు ౧౦—౦—౦. పిల్లలసరములబలహీనత, చంటిబిడ్డల వ్యాధులు, అజీర్తి, రేచీకటి, శరీరము ఎండిపోవుట, క్షయ, మేహరణములు, గజ్జి, మొదలగు వ్యాధులకు ఇది వాడవచ్చును. గర్భిణీస్త్రీలు ప్రసవించుటకు ముందు రెండు నెలలును, బాలెంతరాండ్రు ప్రసవించినతరువాత రెండు నెలలును ఇది వాడుట మంచిది. భోజనానంతరము రోజుకు రెండు మూడు పర్యాయములు తడవకు ఒకటి మొదలు రెండున్నర టీస్పూనుల చొప్పున వాడవలెను. క్రమముగా ఎనిమిదిటీస్పూనులవఱకు మోతాదు పెంచవచ్చును. అజీర్తికలిగినయెడల మోతాదు తగ్గించవలెను. రేచీకటికి ఈనూనెను లోపలికి పుచ్చుకొనుటయేకాక కొన్నిచుక్కలు కండ్లలో కూడ వేసికొనవచ్చును. నూనెకొఱకుగాని ఇతర వివరములకుగాని డాక్టరు నాయుడుగారికి వ్రాయనగును.

# గ్రంథవిమర్శనము

<u>ఖండకావ్యము</u>: మొదటిభాగము - రెండవ భాగము: క్రౌను సైజు; ౧ భాగము ౧౧౫ పుటలు; ౨ భాగము ౧౦౭ పుటలు; కాగితము మంచిది; అచ్చు పెద్దటైపు. ఒక్కొక భాగము వెల ౧౨ అణాలు.

కర్త—శ్రీ జీ. జాషువ కవిగారు; వినుకొండ హైస్కూలులో తెనుఁగు పండితులు; పిరదౌసి, స్వప్నకథ మొదలగు పొత్తములు వ్రాసినారు; ఇపుడు మంచిపేరు పొందిన కవులలో ఒకరు; పెక్కుచోట్ల మన్ననలందినవారు.

ఇందు, మొదటిభాగమును తమ తల్లిగారికిని, రెండవభాగము తమ తండ్రిగారికిని అంకితమిప్పించి, ముద్రింపించిన శ్రీ వకా దండయ్యపంతులుగారికి, జాషువా కవిగారేకాక, తెనుఁగువారును కృతజ్ఞులు కాఁ దగును.

వీరికవిత్వము పండితులను పామరులను రంజింపఁ జాలినదగుటచే దానిని గూర్చి ప్రశంసించుట చర్వితచర్వణము. వీరిది మొత్తముమీఁద పూర్వసాహిత్యపద్ధతి; పాకము ద్రాక్షాపాకము.

గ్రంథాలయములవారును, ఆంధ్రకవితాభిలాషులును, ఈ ఖండకావ్యమును కొని, కృతికర్తకు ఇంకను మంచి గ్రంథములు వ్రాయుటకు వలయు ప్రోత్సాహ మిచ్చెదరుగాక!

### ప్రబుద్ధాంధ్ర

౧౫ నెలల పిదప మరల వెలువడిన ప్రబుద్ధాంధ్రకు స్వాగతము! ఇది నడుమను ఆఁగిపోవుటచే పత్రికాలోకమున ఎంతో లోటుకలిగినట్లనిపించె. ఆరోగ్యము కలిగి, తమపత్రికను తిరిగి ప్రకటింప పూనుకొనిన దీని సంపాదకులగు మామిత్రులను శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని ఎంతయు అభినందించెదము. ఇప్పటినుండి ఇది నిర్విఘ్నముగా సాగుఁగాక!

28

# ఎన్నికలు

**తెనాలితాలూకా గ్రంథాలయసంఘము**

**నూతనకార్యనిర్వాహకవర్గపు టెన్నికలు**

౧౦-౭-౩౭ తేదీ ఉదయము ౮-౪ గంటలకు తెనాలిలో కాంగ్రెసు కార్యాలయమున శ్రీయుత అలపర్తి సుబ్బయ్యచౌదరిగారి అధ్యక్షతక్రింద పై సంఘముయొక్క సాధారణసభ జరిగినది. ఈ క్రిందివారు కార్యనిర్వాహకసభ్యులుగా నెన్నుకొనబడిరి.

శ్రీయుత త్రిపురనేని గోపీచందుగారు
బి. ఏ., బి. ఎల్. అధ్యక్షులు
,, రావర్ల శివరామకృష్ణయ్యగారు
ఉపాధ్యక్షులు
,, పాతూరి నాగభూషణంగారు
కార్యాలయ కార్యదర్శి
,, చుండూరు వెంకయ్యగారు
సంచార కార్యదర్శి
,, ఆరమండ్ల వెంకయ్యచౌదరిగారు
(ఉభయభాషాప్రవీణ)
,, ఎడవల్లి బసవపున్నయ్యగారు
,, వాసిరెడ్డి జగపతిరావుగారు
,, రావి సత్యనారాయణగారు బి. ఏ.
,, వాసిరెడ్డి వీరభద్రయ్యగారు

తక్కిన ౬ గురు సభ్యులను వేసికొనుటకు కార్యనిర్వాహకవర్గమున కధికారమీయబడినది.

ఈ సంవత్సరమునకు కార్యాలయము పెదపాలెమునకు మార్చుటకు తీర్మానించిరి.

కీ॥ శే॥ వల్లూరి సూర్యనారాయణరావు, తోకల నాగయ్య (తె. తా. గ్రం. సం. కార్యదర్శి) గార్ల మరణములపట్ల సంతాపమును వెలిపుచ్చుచు వారిఆత్మలకు శాంతినొసగుటకై భగవానుని ప్రార్థించిన పిమ్మట సభ సమాప్తమయ్యెను.

పెదపాలెము, ౧౦-౮-౩౭. } పాతూరి నాగభూషణం.
కార్యాలయ కార్యదర్శి,
తె. తా. గ్రం. సంఘము.

---

**శ్రీభ్రమరాంబామల్లేశ్వరాంధ్రగ్రంథాలయము,**

**బెజవాడ.**

**కార్యనిర్వాహక సభ్యుల యెన్నిక**

ది ౩౧-౭-౩౭ తేదీని పై గ్రంథాలయ భవనమున సామాన్యసభ్యులసభ జరిగినది. కార్యనిర్వాహక సభ్యుల యెన్నిక జరిగినది.

మ॥ రా॥ శ్రీ గోపు శేషావతారముగారు,
అధ్యక్షుఁడు.
,, నం॥ వేంకటనరసింహారావుగారు,
,, మద్ది సుబ్బారావుగారు;
ఉపాధ్యక్షులు.
,, బచ్చు వెంకటేశ్వరులుగారు,
కార్యదర్శి.
,, గుండా కృష్ణమూర్తిగారు,
సహాయకార్యదర్శి.
,, పొట్టి వెంకటసుబ్బయ్యగారు,
భాండాగారాధిపతి.
,, వక్కలగడ్డ సుబ్బయ్యగారు,
కోశాధికారి.

తక్కినసభ్యులు ౧౮ గురు.

# గ్రంథాలయవృత్తాంతములు

బోటుసంచార గ్రంథాలయ వార్షికోత్సవము.

ఈగ్రంథాలయ వార్షికోత్సవము గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షులగు పాతూరి సుబ్బయ్యా చౌదరిగారి అధిపత్యముక్రింద కొల్లూరు బోర్డు హైస్కూలు భవనమున జరిగినది. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాధ్యక్షులగు గాడిచెర్ల హరి సర్వోత్తమరావు పంతులుగారు- కల్లూరి చంద్ర మౌళియమ్. యల్. ఎ గారు శరణు రామ స్వామి చౌదరిగారు మొదలగు ప్రముఖులేగాక మండలములోని వివిధప్రాంతములందలి గ్రంథా లయోద్యమ నాయకులును, అభిమానులును పలు వురు విచ్చేసిరి.

బోటుగ్రంథాలయమును వచ్చిన వారందరు సందర్శించిన పిమ్మట బ్యాండుమేళముతో బయ లుదేరి జయధ్వానములతో గ్రంథాలయాదర్శ ములకు సంబంధించిన వాక్యములుగల అట్టలతో జరిగినయూరేగింపునేత్రానందకరముగ నుండెను. అందరును హైస్కూలు భవనమునకు తిరిగి వచ్చిన తరువాత గుంటూరుజిల్లాబోర్డు స్థానిక సంఘసభ్యులగు కాసరనేని అంకినీడుచౌదరిగారు అందరికిని ఆతిథ్యమొసంగిరి. ఫలహారానంతరము ఫొటోతీయబడెను.

గుంటూరు మండలగ్రంథాలయసంఘపక్ష మున ఉపాధ్యక్షులగు కస్తూరి కుటుంబరావు గా రేర్పాటుచేసిన గ్రంథాలయ ప్రదర్శనమును స్థానిక హైస్కూలు ప్రధానోపాధ్యాయులగు కందాళ హనుమంతరావుపంతులుగారు బహిరంగ పరచిరి.

హైస్కూలు విద్యార్థులిరువురు ప్రార్థనను శ్రావ్యముగ జేసినపిదప ఈగ్రంథాలయసంయుక్త కార్యదర్శి పుతుంబాక శ్రీరాములుగారి ప్రతి పాదనపై పాతూరి సుబ్బయ్యచౌదరిగా రధ్యక్ష పీఠమును అలంకరించిరి. వారితొలిపలుకు లైన తరువాత సంచార గ్రంథాలయనివేదికను కార్య దర్శి చదివి వినిపించెను. అందు ఈబోటు గ్రంథా లయము ప్రారంభమునుండి యిప్పటివరకు ఎట్లభి వృద్ధిచెందినదో అంకెలతోసహా వివరింపబడెను.

అటుపిమ్మట ఈ సభా ప్రధానోపన్యాసకులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు పంతులుగారు కర తాళధ్వనులమధ్య లేచి గంభీరమును హృదయ రంజకమును నగు ఉపన్యాసమొసంగిరి. అందు విజ్ఞాన సముపార్జనములేనిదే యేదేశమును పైకి రాజాలదనియు, ఇందుకు పాఠశాలలు, విశ్వ విద్యాలయములు గ్రంథాలయములు ఎన్ని యున్నప్పటికిని యింకను ఇవి వ్యాప్తిజెందవలసిన అవసరము గలదనియు ప్రేక్షకులకు నచ్చచెప్పిరి.

విజ్ఞానమనగా కేవలము చదువుట, వ్రాయుట అని మాత్రమే తలంచుట పొరబాటు. నేడు ప్రపంచమున జరుగుచున్న భావపరివర్తనమును గ్రహించి, దానిని మన దేశోన్నతికై వినియో గించు శక్తిని సంపాదించినపుడే విజ్ఞాన మని పించుకొనగలదు. మన మిపుడున్న దారిద్ర్యస్థితి నుండి తప్పించుకొనవలెనన్న ఏ యే దేశము లను 'డీ' కొనవలెనో యోచించి వారికన్న అన్ని శాఖలయందును మనము విజ్ఞానము చేకూర్చుకొన గలిగిననాడే 'మన లక్ష్యము'ను జేరగలము.

నేడు మనదేశములోని ప్రజలందరకు నిర్బంధ ప్రాథమికవిద్య ప్రసాదించినంతమాత్రమున మన మెంతో ఘనకార్య మొనరించినట్లు తల చుట కేవలము వెఱ్ఱి. విజ్ఞానప్రచారము ఇతర దేశములలో ఏవిధముగ జరిగినదియు ఇపుడు

జరుగుచున్నదియు చూచిన అచ్చెరువొందుదుము. ఒకప్పుడు అన్ని దేశములకన్న వెనుకబడినరష్యా నేడన్నివిధముల విజ్ఞానవ్యాప్తియందు ముందంజ వేయుచున్నది.

ఇటులనే ఇటలీ, జర్మనీ, స్పెయిన్ మొదలగు దేశములు కూడ తమ తమ యున్నతికవసరమైన విజ్ఞానమును వెదజల్లుటలో తీవ్రముగా కృషిచేయుచున్నవి. ఇట్టి పరిస్థితులలో మన పురాణములను చూచి మురియుచు అందరికి మనము ఆధ్యాత్మికముగ గురువులమని అనుకొన్నంత మాత్రమున మనకును మన దేశమునకును కూడ ఎట్టి ప్రయోజనముగానియుండదు.

ఇపుడు మనము దారిద్ర్యముతోను, అప్పులతోను బాధపడుచు వివిధ జీవితశాఖలలోను ఇతర దేశీయులచే ఏవిధముగా కొల్లగొట్టబడుచున్నదియు గ్రహించి భౌతికశాస్త్ర విజ్ఞానమును పెంపొందింప జేసికొని ఆ యా దేశవాసుల నెదుర్కొనగల శక్తిని సంపాదించిన నాడే యితరదేశవానులచే మన మొక జాతిగ పరిగణింపబడుదుము. పుస్తకములు చేర్చుటయే గ్రంథాలయనిర్వహణ మనుకొనరాదు. భాండాగారములందు గల పుస్తకముల సారమును ప్రజలు గ్రహించునట్లు చూచుటయే గ్రంథాలయ ధర్మము.

ఇట్లు దేశములో విజ్ఞానప్రచారము విరివిగ లేని కారణమున గలిగిన మన దుర్భరస్థితిని వర్ణించి దీనినుండి బయల్పడుటకై గ్రంథాలయములద్వారా విజ్ఞానవాహినిని ప్రవహింపజేయవలసిన అవసరమును సభాసదులకు వివరించి వారి హృదయముల హరించిరి.

తదుపరి కల్లూరి చంద్రమౌళిగా రుపన్యసించుచు విజ్ఞానప్రచారము విరివిగా జరుగవలెనన్న మనమిపుడున్న పరిస్థితులలో ఏమియు చేయజాలమనియు, దేశస్వాతంత్ర్య పిపాస అందరికినిగలిగి యెల్లరును స్వాతంత్ర్యమంత్రమును జపించి అందరును తమ తను మనఃప్రాణముల నర్పించి స్వాతంత్ర్యమును బడసిననాడు మనమును విజ్ఞానప్రచారమున ఏదేశమునకును వెనుకబడమనియు వచించిరి.

శరణు రామస్వామి చౌదరీగారు విదేశములలో విజ్ఞానవ్యాప్తికి గ్రంథాలయము లేవిధముగ తోడ్పడుచున్నదియు, వానికి ప్రభుత్వము వారు ఏసాయము చేయుచున్నదియు చెప్పిరి. మనదేశములోని ప్రభుత్వమువారు విద్యాప్రచారమునకును గ్రంథాలయోద్యమవ్యాప్తికిని చూపుచున్న సవతి తల్లి ప్రేమను నిరసించిరి.

ఏటుకూరి వెంకటనరసయ్యగారు (కొల్లూరు హైస్కూలు తెలుగుపండితులు) గ్రంథాలయోద్యమప్రబోధమునకు సంబంధించిన పద్యములు వ్రాసి చదివిరి.

అడుసుమిల్లి శ్రీనివాసరావుగారును, కస్తూరి కుటుంబరావుగారును ప్రజలలో స్వాతంత్ర్య బీజములు వెదజల్లుటకు గ్రంథాలయము లేవిధముగ తోడ్పడగలిగినదియు స్వానుభవములను జెప్పి సభికుల నాకర్షించిరి. నేతిచలపతి, తుమ్మల సీతారామచౌదరిగా రుపన్యసించినపిమ్మట అధ్యక్షునకు వందనముల నర్పించుటతో సభా కార్యక్రమము ముగిసెను.

సేవాశ్రమవాణీమందిరము - పెదపాలెము.

శాఖా గ్రంథాలయప్రారంభము.

ఆగస్టు ౧ వ తేదీ ఆదివారము మధ్యాహ్నము 3 గంటలకు గుంటూరుతాలూకా పెద్దవడ్లపూడి గ్రామములో పై కేంద్రగ్రంథాలయ పక్షమున నొక శాఖాగ్రంథాలయము స్థాపింపబడినది.

ప్రారంభోత్సవము తెనాలి తాలూకాగ్రంథాలయసంఘాధ్యక్షులగు శ్రీయుత త్రిపురనేనిగోపీచందు, బి. ఏ., బి. ఎల్. గారి అధ్యక్షతక్రింద జరిగినది. మొదట గ్రంథాలయ ప్రబోధవాక్యము లంటించబడిన అట్టల గ్రామబాలురు వెంటగొనిరా అధ్యక్షుల నడుమనిడికొని మంగళ వాద్యములతో ఊరేగింపుజరిగి అల్పాహారానంతరము గ్రామములోని పాఠశాలావరణమున నొకసభ జరిగెను. గ్రామస్థులేగాక ప్రక్కయూళ్ళనుండి పలువురు గ్రంథాలయ సేవకులును గ్రంథాలయోద్యమాభిమానులును పై యుత్సవమునకు విచ్చేసి సభ నలంకరించిరి. ప్రార్థన, అధ్యక్షుడు పీఠమునలంకరించుట జరిగిన పిమ్మట కేంద్రగ్రంథాలయ కార్యదర్శి శ్రీయుత పాతూరి నాగభూషణంగారు తమ గ్రంథాలయముయొక్క ఆదర్శములను వివరించిరి. స్థానిక పాఠశాలా ప్రధానోపాధ్యాయులు శ్రీయుత బంకరుసుబాపయ్యగారు గ్రంథాలయ ప్రయోజనములగూర్చిన చక్కని వ్యాసమును సభలో చదివిరి. పెద్దవడ్లపూడి గ్రంథాలయ పూర్వచరిత్రను డాక్టరు కూచిభట్ల వేంకటేశ్వరశర్మగారు సంగ్రహముగా చెప్పినమీదట మున్గిరాలనుండి విచ్చేసిన పి. కేశవరావు నాయుడుగారు తమ మృదుమధురవాక్కులతో సభికులయుల్లముల రంజిల్లజేసిరి. వారియుపన్యాసము గ్రంథాలయసేవయందువారికిగలపరిపూర్ణానుభవమును చాటి స్థాపకులకేగాక తక్కిన శ్రోతలకుకూడ చక్కనియనుభవము నవగాహనచేసికొన నవకాశమిచ్చినది. ఉపన్యాసకుల ప్రసంగములు పూర్తికాగానే హర్షధ్వనులమధ్యలేచి అధ్యక్షులు సరసమైన చక్కని ప్రసంగమును కొలది నిమిషములలో ముగించిరి. మాట్లాడిన నాలుగుమాటలును పొల్లులేక సారవంతములైనవగుట ప్రశంసింపదగియున్నది. జ్ఞానముయొక్క ప్రయోజనము, దాని వ్యాపనావశ్యకత అందులకు గ్రంథాలయము లెట్లు వినియోగపడుచున్నది అను నది అధ్యక్షుల ఉపన్యాస విషయము.

గ్రామవాసులు శ్రీయుత అన్నె సంజీవరావుగారివందనసమర్పణముతో సభ సమాప్తమయ్యెను.

ది ౧-౮-32 తేదీ సాయంకాలము శ్రీ విస్సా అప్పారావు పంతులుగారిఅధ్యక్షతను, రాజమహేంద్రవరములో దానవాయిపేటగ్రంథాలయము ఏర్పడినది.

కీ॥ శే॥ డాక్టరు కే. పీ. జయస్వాలుపండితుఁడు తనగ్రంథాలయమును కాశీ విశ్వవిద్యాలయమున కీయవలెనని విల్లులో వ్రాసినట్లు తెలియుచున్నది.

ది ౨-౮-32 తేదీని శ్రీజయపుర మహారాజుగారి అధ్యక్షతను ఆంధ్రసాహిత్యపరిషత్తు వార్షికోత్సవము ఉదయము ౮ గంటలకు సెల్లూరిన్యాయవాదులగు శ్రీ విస్సా రాజగోపాలరావు పంతులు గారి పెద్దఱికమున అత్యుత్సాహకరముగ జరగెను. పలువురు పండితులు ఉపన్యసించిరి.

సాయంకాలము ౪ గంటలకు శ్రీ ఎఱ్ఱాప్రగడమహాకవివర్ధంత్యుత్సవము శ్రీ కోటనరసింహయ్య పంతులు (పించనుజడ్జి)గారిఅధ్యక్షతను సంతోషప్రదముగ సాగినది.

### తెనాలితాలూకా గ్రంథాలయసంఘము

### కార్యనిర్వాహకవర్గసమావేశము

పైసంఘముయొక్క కార్యనిర్వాహకవర్గము ౧౫-౮-32 వ తేదీ మధ్యాహ్నము ౨ గంటలకు

తెనాలి సూతాశ్రమములో శ్రీయుత త్రిపురనేని గోపీచందు బి. ఏ., బి. ఎల్. గారి అధ్యక్షత క్రింద సమావేశమై యీదిగువ తీర్మానములను గావించిరి.

౧. ఈక్రిందివారిని కార్యనిర్వాహకవర్గమునకు చేర్చుకొనడమైనది.

శ్రీయుత గిడుగు నరసింహమూర్తిగారు
బి. ఎ. ఎల్. టి, తురుమెళ్ల.
,, అక్కపెద్ది రామకోటిశాస్త్రిగారు
కూచిపూడి.
,, వెన్నం కోటయ్యగారు, రాలికంపాడు.
,, బొద్దులూరి సూర్యనారాయణగారు
దావులూరు.
,, సజ్జా కృష్ణయ్యగారు, చదలవాడ.

౨. ఈసంఘమునకు తాత్కాలిక నిబంధనల తయారుచేయుటకు ఈ క్రిందివారిని నియమించడమైనది.

శ్రీయుత త్రిపురనేని గోపీచందుగారు
,, శరణు రామస్వామిగారు
,, పాతూరి నాగభూషణంగారు

ఈ ఉపసంఘమునకు పాతూరి నాగభూషణంగారు సమావేశకులుగా నుందురు.

3. కార్యనిర్వాహకసభ్యులందరుఒక్కొక్కరు ౨౦ మందికి తక్కువ లేకుండ ఈసంఘమునకు అక్టోబరుమాసాంతములోగా సభ్యులను చేర్పించ కోరడమైనది.

౪. ఈ సంవత్సరము తెనాలి తాలూకా గ్రంథాలయ మహాజనసభను దుగ్గిరాల ఫిర్కా రేవేంద్రపాడు గ్రామములో జరుపుటకు ఆహ్వానముమీద అంగీకరించడ మైనది.

౫. నేటివరకైన యీ సంఘముయొక్క జమాఖర్చులను అంగీకరించడమైనది.

౬. ఈసంఘపక్షమున తాలూకాయందంతటను నెలకొకటికి తక్కువగాకుండ ప్రచారకోపన్యాసములను పుస్తకోపన్యాసములను ఏర్పాటు చేయుటకు తీర్మానించడమైనది.

పా. నాగభూషణం,

చిరునామా : కార్యదర్శి.

సేవాశ్రమము,
పెదపాలెము (వయా) దుగ్గిరాల.

౧౮-౮-౧౯౩౪ తేదీనిపెదనిండ్రకొలను గ్రామ పాఠశాల భవనములో మ. రా. శ్రీ మండలపర్తి రామచంద్రరావు పంతులుగారి సన్మానసభ జరిగినది. సభకు మ॥ రా॥ శ్రీ పెమ్మరాజు నారాయణమూర్తి పంతులు బి.ఏ (తహసీల్దారు, తాడేపల్లిగూడెం తాలూకా) గారు అధ్యక్షత వహించిరి. గ్రామస్థులలో ప్రముఖులు అనేకులు సభ నలంకరించిరి. గ్రామస్థుల తరఫున శ్రీ మండలపర్తి లక్ష్మీనారాయణగారిచే రామచంద్రరావుగారికి వినుతిపత్రము సమర్పింపబడినది. అందు సుమారు ౧౦ సం॥లు పంచాయతీ ప్రెసిడెంటుగా పనిచేసి ప్రజాసేవజేసిన పంతులుగారి దేశభక్తి, విద్యానురక్తి, జనరంజకశక్తి కొనియాడబడినవి. గ్రామకరణము మండలపర్తి వెంకటాద్రియ్యగారు, పంచాయతీ బోర్డుమెంబరు మండలపర్తి గంగరాజుగారు శ్రీ రామచంద్రరావుగారు చేసిన సేవనుగురించి ప్రశంసించిరి. శ్రీ రామచంద్రరావుగారు తమ రొక్కరివలననే పైపనులు జరుగలేదనియు గ్రామస్థులందరి సహకారమువలన ఈ సత్కార్యములు జరిగినవనియు సమాధానము చెప్పిరి. శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి ఆరోగ్యాభివృద్ధికొరకు ఒక తీర్మానమును పంచాయతీగ్రంథాలయసేవజేసిన శృంగారకవి భోగేశ్వరరావుగారి నభినందించుచు

ఒక తీర్మానమును చేయబడినవి. సభాధ్యక్షులు శ్రీ రామచంద్రరావుగారి నభినందించుచు ఇటువంటి సన్మానసభలు ఎక్కువగా జరుగవలెనని కోరిరి. చిలుకూరి లక్ష్మణరావుగారి వందనములతో సభ ముగిసెను.

గ్రంథాలయములవారు ఇట్టి సభలుచేసి, ఆయా ఉద్యమాభిమానుల గౌరవించుట అత్యావశ్యకము.

ది ౧౮-౮-32 తేదిని పెదనిండ్రకొలను (తాడేపల్లిగూడెం తాలూకా) గ్రామ మందలి జిల్లాబోర్డు ప్రాథమికోన్నత పాఠశాలాభవనములో వయోజన విద్యాశాఖ ప్రారంభోత్సవము మహారాజశ్రీ పెమ్మరాజు నారాయణమూర్తిపంతులు, బి. ఏ., (తహసీల్దారు, తాడేపల్లిగూడెంతాలూకా) గారిచే జయప్రదముగా జరుపబడినది. సభకు శ్రీ తాడినాడ వెంకటలక్ష్మీనరసింహము పంతులుగారు అధ్యక్షత వహించిరి. ప్రథమములో శ్రీ మందలపర్తి ఉపేంద్రశర్మ,(ఎం. ఏ., అనర్సు) గారిచే వయోజన విద్యావ్యాప్తి యెట్లుజరుగదగునో ఉపన్యసింపబడెను. పిమ్మట గ్రంథాలయ కార్యదర్శియగు లంక రామమూర్తిగారిచే నివేదిక చదువబడెను. గుండాబత్తుల వీరభద్రుడుగారి అభివందనములతో సభముగిసెను.

తక్కిన గ్రంథాలయములవారుకూడ వయోజన విద్యాశాఖ ఏర్పఱిచి పనిచేయుదురుగాక!

ది ౧౯-౮-32 తేదీని పెదనిండ్రకొలను గ్రంథాలయ సంఘము యాజమాన్యమున పాఠశాలాభవనమున బ్రహ్మశ్రీ వావిలకొలను సుబ్బారావుగారి వార్షికోత్సవము జయప్రదముగా జరుపబడినది. మహారాజశ్రీ మందలపర్తి ఉపేంద్రశర్మగారు సభకు అధ్యక్షతవహించిరి. శ్రీయుత పమ్మిదుర్గయ్యగారు శ్రీ కవిగారిని గుఱించి ఉపన్యసించిరి. వందనసన్మానములతో సభముగిసెను.

వివేకప్రదాయినీ గ్రంథాలయము, సోంపేట.

ఈ గ్రంథాలయసభ ది ౨౧-౮-32 తేదిని సాయంకాలము ౪ గంటలకు పట్టుశాలీయ భజనమందిరమున మ॥ రా॥ శ్రీ బత్తుల సీతారామయ్యగారి అధ్యక్షతను జరిగినది. అధ్యక్షులును ఇతరులును గ్రంథాలయోద్యమమును గూర్చి విపులముగా ఉపన్యసించిరి. గ్రంథాలయమునకు సభ్యులుగాను, అభిమానులుగాను, పోషకులుగాను చేరి ప్రోత్సహింపవలెనని కార్యదర్శి మ॥ రా॥ శ్రీ పచ్చిళ్ల శ్రీరాములుగారు సభాసదులను కోరిరి.

తెనాలితాలూకా గ్రంథాలయ సంఘము
కార్యవర్గముయొక్క అవసరసమావేశము

౨౬-౮-32 వ తేదీ సాయంకాలము ౪ గంటలకు తెనాలితాలూకా గ్రంథాలయసంఘకార్యవర్గముయొక్క అవసర సమావేశము తెనాలిలో పురపాలక గ్రంథాలయమువద్ద జరిగెను.

శ్రీయుత వెన్నం కోటయ్యగా రధ్యక్షత వహించి.

ఆంధ్రదేశములోని వివిధపట్టణ, తాలూకా, జిల్లా, రాష్ట్రగ్రంథాలయ సంఘములయొక్క పరస్పర సంబంధమును ఆలోచించి రాష్ట్రసంఘమునకు సిఫారసు చేయుటకై పై సంస్థలయొక్క ప్రతినిధుల సభను తాలూకా గ్రంథాలయ మహాజనసభతోపాటు రేవేంద్రపాడులో గాని, పెదపాలెములోగాని జరుపుటకు నిర్ణయము జరిగెను.

కార్యవర్గమునకు గల ఖాళీకి శ్రీయుత గుండవరపు వేంకటేశ్వర్లుగారు నియమించబడిరి.

పా. నాగభూషణం,
కార్యదర్శి.

## గ్రామోద్ధరణము

### రేపల్లెతాలూకా సింగుపాలెము

గ్రంథాలయముదగ్గఱ మహారాజశ్రీ యేర్లగడ్డ కృష్ణయ్య (పంచాయితీబోర్డు ప్రెసిడెంటు) గారి ఆధిపత్యమున బ్రహ్మాండమైన సభజరిగెను. (౨౬-౮-32) శ్రీయుత వాడపల్లి మురహరిరావుగారు గంభీరోపన్యాసము గావించిరి.

(౧) గ్రామజనుల ఐకమత్యావశ్యకతగురించి, విద్యయొక్క ఆవశ్యకతగురించి విపులముగా చెప్పిరి.

(౨) జనాభా పెరుగుట, భూమిమీద ఒత్తిడి పంటవృద్ధియొక్క ఆవశ్యకత వగైరాలనుగురించి చర్చించిరి.

(3) రేపల్లెతాలూకాలో మూడవ రకపు నిస్సారపు పొలములను బాగుచేయు పద్ధతులను గురించి క్లుప్తముగా చెప్పుచు నీటివసతి, మురుగుపోవు వసతులను వృద్ధిచేయుటగురించి మాటలాడిరి.

(౪) రసాయనపు ఎరువులను తగ్గించి గొడ్లగొట్టె ఎరువులు, చేపయెరువు, గానుగపిండి వేరుసెనగ వగైరాలు ఎందుకు వాడవలయునో విశదీకరించిరి. విత్తనప్రాశస్త్యము, మార్కెట్లు, తూకములు వగైరాలనుగురించి మాట్లాడిరి. చేతివృత్తులు, దంపుడుబియ్యము, పాడివృద్ధిచేయుట గ్రామోద్ధరణమునకు ఎంత అవసరమో చెప్పిరి. తోటలు వృక్షములు నాటుట, ఎరువులకొరకు గంగరావి కానుగపచ్చియాకు ఎరువులు ఎట్లు ఉపయోగపడునో మొదలగు విషయములు మనోరంజకముగా ఉపన్యసించిరి. సభ జయప్రదముగ మ॥ రా॥ శ్రీ వడ్లమూడి ఆంజనేయులు పంతులుగారి అంత్యోపన్యాసముతో ముగిసెను.

## గ్రంథాలయము విద్యాపోటీపరీక్షలు

### రేపల్లెతాలూకా సింగుపాలెం

ది ౨౮-౮-32 తేదీని గ్రంథాలయమువారి ప్రోత్సాహముచే బోర్డుపాఠశాల బాలబాలికలకు విద్యాపోటీపరీక్షలు జరుపబడెను. మ॥ రా॥ శ్రీ యార్లగడ్డ రాఘవయ్యగారు బాలురను ప్రోత్సహించుకొఱకై ద్రవ్యసాహాయ్యము చేసి వారి ఔదార్యమును చూపిరి. మ॥ రా॥ శ్రీ కొల్లి వెంకటకృష్ణయ్యచౌదరి (పంచాయతీబోర్డు వైస్ ప్రెసిడెంటు) గారి యాజమాన్యమున సభ జరుపబడి బాలబాలికలకు బహుమతులు ఫలాహారములు పంచిపెట్టబడెను. తరువాత ఉపాధ్యాయులకు గ్రామీయులకు గల సంబంధములను గూర్చి శ్రీయుత వడ్లమూడి ఆంజనేయులు పంతులుగారిచే ఉపన్యాసము ఇయ్యబడెను. అధ్యక్షుని అంత్యోపన్యాసముతో సభ ముగిసెను.

## శ్రీ వేంకటేశ్వరవిలాస గ్రంథాలయము

### ఉపమాక అగ్రహారము

### భవననిర్మాణనిధి

మహాజనులారా!

శరీరమునకు శిరస్సు ఎట్టిదో గ్రామమునకు గ్రంథాలయ మట్టువంటిది. గేహము లేనిచో గ్రంథాలయమునకు సంపూర్ణత్వము సిద్ధింపదు. ౧౨ సంవత్సరములనుండి ప్రజల జ్ఞానాభివృద్ధికి సర్వవిధముల తోడ్పడుచున్న మా గ్రంథాలయ భవనాభివృద్ధికి ధనము కావలసియున్నది.

కావున తా మందఱును అభిమానము చూపి సాహాయ్యముచేయ ప్రార్థితులు.

౧-౯-32 ఉపమాక అగ్రహారం } పీ. వేం. కృష్ణమాచార్యులు, కార్యదర్శి.

ఈ గ్రంథాలయమువారు దీనికి శాఖగా గ్రామపారిశుద్ధ్యసంఘము నెలకొల్పి పనిచేయు చున్నారు. శ్రీరామభజనమందిర మేర్పఱచి నడపుచున్నారు.

ఈ గ్రంథాలయమును గూర్చి నాకు బాగుగా తెలియును. కార్యదర్శిగారు కష్టపడి పనిచేయు గ్రంథాలయ సేవకులు. అప్పుచేసి గ్రంథాలయమునకు ఒక భవనము కొనిరి. భవనప్రవేశోత్సవసభకు నేనే అధ్యక్షత వహించితిని. శ్రమపడి యిప్పటికి ఆ అప్పుతీర్చిరి కాని మరమ్మతు కావలసియున్నది. అందులకు ధనసాహాయ్యము ఆవశ్యకము. కావున, గ్రంథాలయాభిమానులును, తక్కిన పరోపకారపరాయణులును తగిన ధనసాహాయ్యముచేసి, గ్రంథాలయ భవనము బాగుచేయించి, గ్రంథాలయ మొనర్చు జ్ఞానదానపుణ్యమును తాము పొందుదురుగాక!

మారేపల్లి రామచంద్రశాస్త్రి,
బెజవాడ.

## గ్రంథాలయపుస్తకముల నిషేధించుఅధికారము

జిల్లా విద్యాశాఖాధికారులకు తమ అధికార ప్రదేశములోనున్న గ్రంథాలయములలోని పుస్తకములు నిషేధించుటకు అధికారము లేదనియు, ప్రభుత్వమువారికే అట్టి అధికారము ఉండుననియు జిల్లాధికారులకు మద్రాసు ప్రభుత్వము వారు తెలిపిరి.

## గ్రంథాలయమునకు గొప్ప విరాళము

అమెరికాసంయుక్తరాష్ట్రములలో మిచిగాన్ రాష్ట్ర శాసనసభవారు గ్రంథాలయముల సాయముకొఱకు, ఏఁడాదికి ౫ లక్షల డాలర్లు ఇచ్చుటకు శాసించిరి. ఇట్టి శాశ్వతమగు ఏర్పాటులలో ఇదే మొదటిది. ఈ బిల్లు గవర్నరగు ఫ్రాంకుమర్ఫీగారిదగ్గఱకు వెళ్ళినది; ఆయన దానిపై సంతకముచేయునట్లు గట్టిగా సూచించెను. ఇందు ౧౦౦ కి ౧౫ చో॥ క్రొత్త గ్రంథాలయములు పెట్టుటకును, ౨ చో॥ ప్రభుత్వగ్రంథాలయ పాలనమునకును, తక్కినది ఉన్న గ్రంథాలయముల సాయమునకును వెచ్చించుటకు నిర్ణయించిరి.

## ప్రబంధకల్పవల్లి

ప్రబంధకల్పవల్లి అను మాసపత్రిక పూర్వము కొంతకాలము ప్రకటిత మగుచుండెను. దాని సంచికలు కావలయునని శ్రీ వేంకటేశ్వర విలాస పుస్తక భాండాగార కార్యదర్శి శ్రీమాన్ పీతాంబరము వేంకటకృష్ణమాచార్యులుగారు కోరినారు.

కాన, ప్రబంధకల్పవల్లి సంచికలనుగూర్చి నభోగట్టా తెలిసినవారు, దయచేసి నాకు తెలుపుదురుగాక!

ది ౨౦-౯-౩౭,
ఆంధ్రదేశ గ్రంథాలయ
సంఘము, బెజవాడ.
} మారేపల్లి రామచంద్ర శాస్త్రి.

## భాషాభిమానులకు విన్నపము

ఉత్తర విశాఖ మండలములో హీరమండలగ్రామమున కీ॥ శే॥ లాడె సుందరనారాయణ కవిగారు ఉండెడివారు. వీరు గొప్ప పౌరాణికులు. రామకథాసుధార్ణవము, ఆపన్నివారణ స్తోత్రము మొదలగు గ్రంథములు రచించి, ముద్రింపించిరి.

కాని వీరు రచించిన 'కోటిఫలిక్షేత్రమాహాత్మ్యము' అను ౫ ఆశ్వాసముల ప్రబంధము అముద్రితముగా ఉన్నది.

కాన, భాషాభిమాను లెవ్వరైనను పూనుకొని యీ గ్రంథమును ముద్రింపించి ఆంధ్రభాషకు నూతనాలంకారము కల్పింప వేఁడుచున్నాఁడను.

౨౧-౮-౩౭,
హీరమండలము.
} పా॥ సత్యనారాయణమూర్తి,
సుజనానుమోదినీ గ్రంథాలయ
కార్యదర్శి.

## భీమవరము తాలూకా గ్రంథాలయయాత్ర.

భీమవరము తాలూకా గ్రంథాలయసంఘము వారు ది ౧-౯-32 మొదలు ది ౧౨-౯-32 వరకు శ్రీయుతులు భూపతిరాజు తిరుపతిరాజుగారి ఆధిపత్యమున యాత్ర బయలుదేరిరి. యాత్రలో పాల్గొనినవారు ౧ వే. సూరపరాజు ౨ గోకరాజు శ్రీరామరాజు 3 సాగిరాజు నారాయణరాజు ౪ గాదిరాజు వెంకట్రాజు ౫ ముదుగంటి జగ్గన్నశాస్త్రి ౬ నడింపల్లి సూర్యనారాయణరాజు ౭ భూ. సుబ్బరాజుగార్లు. వీరు యాత్రలో నడచిన మైళ్ళసంఖ్య 3౮.

దర్శించిన గ్రంథాలయములు గల గ్రామములు ౧ రాయలము, ౨ చినఅమిరము, 3 వేంపాడు, ౪ కోపల్లి, ౫ పెదఅమిరము, ౬ వాండ్రము, ౭ పెదపుల్లేరు, ౮ జక్కరము, ౯ కాళ్ళ, ౧౦ కోలనపల్లి, ౧౧ కాళ్లకూరు, ౧౨ జువ్వలపాలెము, ౧3 చెరుకుమిల్లి, ౧౪ అయిభీమవరము, ౧౫ దుంపగడప, ౧౬ సిద్ధాపురము, ౧౭ ఆకివీడు, ౧౮ చెఱుకువాడ, ౧౯ కలిసెపూడి, ౨౦ ఉండి, ౨౧ మహాదేవపట్నము, ౨౨ చిలుకూరు.

పై గ్రామములలోని గ్రంథాలయములలో ౪ వార్షిక సభలును, ౮ మహాసభలును, ౯ సమావేశములును జరిగినవి. ౧ గ్రామములో నూతన గ్రంథాలయమును స్థాపించిరి.

ఈ యాత్రలో ఆ యా గ్రామములలోని గ్రంథాలయాధికార్లు చాలా సహాయపడి గ్రంథాలయోద్యమమునకు తమ శక్తివంచన లేకుండ సహాయపడెదమని వాగ్దానములు చేసిరి.

పా॥ సత్యనారాయణశర్మ,
తాలూకా గ్రంథాలయ సంఘకార్యదర్శి.

---

## సుబ్రహ్మణ్య గ్రంథాలయము, అమ్మవారికుప్పము,
## తిరుత్తణితాలూకా - చిత్తూరుజిల్లా.

ఈ పుస్తకాలయ వార్షికోత్సవ సమావేశము ౮-౯-32 వ తేదిన పండిత తుర్లపాటి గురుస్వామిశర్మగారి అధ్యక్షతను జరిగెను. ఎం. సుబ్బరామయ్యగారు కార్యదర్శి నివేదికను చదివిరి. గ్రంథాలయ సార్థక జన్ముడయిన కీర్తిశేషులగు మామిడివఝుల సుబ్రహ్మణ్యం పంతులుగారి దివ్యజీవచారిత్రయందలి పరమోత్కృష్టాంశముల గుఱించి రామస్వామి నాట్టరుగారు విపులపరచిరి.

పురుషార్థములెల్ల సాధించుటకు సద్గ్రంథాలయముమూలమున గలిగిన సన్మార్గసచ్చింతలే జీవితసత్పథమునకు దారి యని పల్కిరి. గ్రంథాలయ గ్రంథపఠనమువలని మేళ్లు, ధర్మగ్రంథాలయావశ్యకత, గ్రామ పునర్నిర్మాణమునకు దోడ్పడు సమస్యలగు గోసేవ - మాతాశిశుసంరక్షణ విధానములలో విద్యార్థులు నొనర్పవలసిన అవసరమగు సహాయము, తగు ధర్మము. జోలెడూచెడు హస్తమునందే జగతిని ఊచుటకు కాల మాసన్నమగుచున్నదను పలువిధాంశముల గురించియు పలువు రుపన్యసించిరి. ఎం. సుబ్బరామయ్యగారిని కార్యదర్శిగాను సింబడి రామస్వామి నాట్టరుగారిని భాండాగారాధిపతిగాను ఎన్నుకొనిరి. వేణుగోపాలసంకీర్తనములతో సభ ముగిసినది. శ్రీ తుర్లపాటి గురుస్వామికవికృత గ్రంథముల కానుకగా నిచ్చి (రాయల) పశ్చిమాంధ్రసీమలోని ధర్మగ్రంథాలయస్త్రీసంస్థలకు నుచితరీతిని నొసగుటకు కార్యకరులు యత్నించుచున్నారు. విద్యాభిమానులగు స్త్రీపురుషవరేణ్యు లెల్లరును శ్రీ సుబ్రహ్మణ్య గ్రంథాలయమునకు వారిచ్చు నుత్తమగ్రంథములను కానుకగా స్వీకరించి ప్రత్యుపకారమొదవింపవలయునని పలు ధర్మ గ్రంథాలయ సేవకుల తమవితరణాభిమానముల చూపవలెనని ప్రార్థించుచున్నాము.

ఖద్దరుసంస్థానమువారి కె. యస్. బార్టరు కంపెనీ, బెజవాడ (వస్తుమార్పిడిశాఖ)లో రిజిస్టరు చేసికొన్న చందాదారులకు వస్తురూపకమగు చందామీఁద మాపత్రిక అందఁగలదు.

మేనేజరు.

గ్రంథాలయసర్వస్వము.

# గ్రంథాలయ సర్వస్వము

**అఖిలభారతభాష - ప్రాంతీయభాషలు :**

అఖిలభారత భాషా- ప్రాంతీయ భాషలను గురించి గాంధీజీ పదునేడు సూత్రములు నిర్వచించినాడు. అందులో అతడు హిందీకి ఇచ్చిన స్థానము మా సూచనలకు కొంతవరకు సరిపోయినందులకు సంతసించుచున్నాము. హిందూస్థానీ రానిదేశములలో బేసిక్ హిందూస్థానీ సెకండరీ తరగతులలో చెప్పి లిపి ఇచ్చవచ్చినది ఉపయోగించునట్లు చేయవలెననియు, మనము చేయుచున్న యావత్తు కార్యక్రమమును, ప్రభుత్వ విద్యావిధానమును, ఆ యా ప్రాంతీయభాషలలోనే జరుగవలె ననియు విద్యయంతయును ఆ యా దేశభాషలలోనే ప్రైమరీ తరగతుల నుండి యూనివర్సిటీ తరగతులవరకు నేర్పవలెననియు చేసిన సలహాలు గమనింపదగినవి. బేసిక్ హిందూస్థానీని గురించి వ్రాయుచు, అన్ని భాషలలోను ఉన్నసులభపదములను ఈ క్రొత్తభాషలో వాడుకచేయవలెనని అతడువ్రాసెను. అన్ని భారతభాషలకును సమమగు పదజాలము కొంత కలదనియు - అది ఎక్కువగా భిన్నపడిపోకుండ చూచుకొనుట హిందీకి ఇతరదేశభాషలను చాల దగ్గరిచుట్టములను చేయుటకు పనికివచ్చుననియు-మేమిదివరలో వ్రాసిన విషయమును ఈ సందర్భమున స్మరింపజేయుచున్నాము. ఇంతవరకు సరియేకాని ఒక్కవిషయంబునందు గాంధీజీతో ఏకీభవించుట మాకు సులభసాధ్యముగా తోచలేదు. విశ్వవిద్యాలయభాగములో పెద్ద శాస్త్రవిషయములను నేర్చుకొనువారిని మినహాయించి మిగత యందరకును హిందూస్థానీయును ఇంకొక విదేశభాషయు నిర్బంధముగా నేర్పవలెనని ఆయనయూహ. ఇవియును మాతృభాషాధారకము గానే నేర్పవలెననియు వారియాశయమని తోచును. అప్పటికి మూడుభాష లయినవి. ఇక సామాన్యశాస్త్రవిషయాలకు అవకాశముఉండ వలసివచ్చును. కాబట్టి ఇన్నిటిని నిర్బంధము చేయుట పొసగదు. బేసిక్ హిందీ యనగా కొద్దిపాటిభాష అయి తీరవలెను. దానిని సెకండరీ తరగతులలో మూటియందు నిర్బంధముగా నేర్పి తక్కినచోట్లనెల్ల హిందీని ఐచ్ఛికము చేసిననే నేర్చువారికిని మేలు - ఆ భాషకును మే లని మాయభిప్రాయము.

ఉర్దూ హిందీభాషల భేదము అన్నిభాషలలోని సమానపదములసహాయమున నేర్పరచు బేసిక్ హిందీనిర్మాణముచే నశించునని గాంధీజీ కనుపరచిన యాశ మాకును కలదు.

లిపులవిషయమున గాంధీజీ దేశపరిస్థితులను బట్టి చాల త్రొక్కులాటపడినాడు. లేటినులిపి ఉపయోగింపదగినదని ధైర్యముగా చెప్పలేక పోయినాడు. ఉర్దూనాగరీలలో ఒకటి తగినదని అనలేక రెంటిని వాడదగు ననినాడు. దేవనాగరివలె దక్షిణభాషలు తయారు చేయుటకు ప్రయత్నింపవలెననుచు అది సాధ్యము కానిచో తమిళము తెలుగు కన్నడము మళయాళలిపులకు సమానలిపిని పరిశోధింపదగు ననినాడు. ఇందులో తమిళములిపితోనే తగాదా. తక్కిన మూటికిని, నాగరలిపికి మాతృకమైనలిపిమాతృక కావడముచేత వీనిని చేర్చవచ్చునేమో! లిపుల మాట ఎట్లున్నను భాషలలోని పదజాలమునకు సామ్యము పరస్పరము కల్పించి, వీనిని హిందీకి

దగ్గరకు తేవచ్చును. మా పత్రికవంటి పత్రిక ఈ భాష లెరిగిన ఒక సంఘ నాయకత్వమున నడపగలిగినయెడల ఈ కార్యము సాధింపవచ్చును. గాంధీజీచేయూత ఇట్టి యుద్యమమునకు కలుగునా ;

ఏడుగ్రామాల కొక ప్రజాసేవకుడు :

మంత్రి శ్రీ వీ. వీ. గిరిగారు తిరువల్లిక్కేణి అఖిలభారత యువకసంఘమువారి వార్షికోత్సవ సందర్భమున నుపన్యసించుచు ఉత్సాహవంతులగు యువకులు ఏడు గ్రామముల కొక్కరి చొప్పున నిర్మాణకార్యక్రమము సాగించేచదువు పెట్టుకొనేయెడల భారత భావి భాగ్యోదయము నిశ్చయమగు ననిరి. గ్రామస్థులకు విజ్ఞానవికాసములు వ్యాపింపజేయుచు ఆరోగ్యపరిస్థితుల కల్పనకు తోడ్పడుచు కోఆపరేటివు కార్యక్రమము నెరవేర్చుచు వీరు పనిచేయునెడల, గృహపరిశ్రమల యభివృద్ధికి తోడ్పడునెడలను, ఇతరులకు ఉపకారము చేయుచు తమకు గౌరవప్రదమగు జీవితమును నిర్మించుకొనవచ్చు ననిరి. నిజమే. గ్రామమున కొక్క రిట్టివా రేర్పడినను ఎక్కువ కాబోరు. ఈ విధముగా జాతీయసమస్యయు తీరును. నిరుద్యోగ సమస్యయు——కొంతవరకైనను——తీరును. ఇందుకు తగిన యువకులును లేకపోలేదు. కాని వారికి తగిన శిక్షణ కేర్పాటులు లేవు. శిక్షణ పొందినవెనుక ఆధారముగా పెట్టుకొనుటకు గ్రంథాలయ ప్రయోజన విద్యాసేవలైనను బలముగా నేర్పడలేదు. కోఆపరేటివు ఉద్యమముకూడ ఇంతకాలము సాహుకారి పద్ధతు లవలంబించి ప్రజారంజకత్వమును కోల్పోయి యున్నది. అభిమానమును అభిప్రాయములును గల శ్రీ వీ. వీ. గిరిగారు విషయము లెరింగిన అనధికార- అధికార ప్రముఖులతో సంప్రతించి త్వరలోనే తగిన పథకము వేయగలరని విశ్వసించు చున్నాము.

ఆంధ్రదేశగ్రంథాలయసభ - తీర్మానములు.

ఆంధ్రదేశగ్రంథాలయసభవా రిటీవలచేసిన తీర్మానములను మరియొకచోట ప్రకటించితిమి. అభిమానులు చదువుకొందురుగాక, ప్రభుత్వమువారు వెంటనే చర్యపుచ్చుకొనినను పుచ్చుకొనలేకపోయినను ప్రతిజిల్లాబోర్డువారును ఏ రెండు మూడువేల రూపాయలో గ్రంథాలయోద్యమమునకు ప్రత్యేకపరచి మా గ్రంథాలయ సర్వస్వమును తమ సెకండరీస్కూళ్ళు, హైయ్యరు ఎలిమెంటరీస్కూళ్ళు, సెంట్రలుక్లాసులు, గ్రంథాలయాలు-వీనికి కావలసినసంఖ్యమాత్ర మైనను కొని, ఉద్యమమును బలపరపవచ్చును. తమ ప్రాంతాలలో ఉద్యమ ప్రచారమునకు కావలసిన సలహాలు సహాయము మా గ్రంథాలయ సంఘమునుండి కోరే జిల్లాబోర్డులతో కలిసి పని చేయుటకు మా సంఘ మెల్లప్పుడును సిద్ధముగా నుండగలదు. ఈ యుద్యమము సర్వవికాసమునకు ప్రాతిపదిక మనుటకు ౧౯౧౮ నుండి ౧౯౨౦ వరకు ఆంధ్రదేశమున వీనిద్వారా జరిగిన కృషి ఉదాహరణప్రాయముగా నున్నది. ఎచ్చటెచ్చట ఈకృషి బలవత్తరముగా జరిగియుండినదో.అచ్చటచ్చట తరువాత జాతీయోద్యమము ఎంతయు విజృంభించినది. కాబట్టి ప్రజాసామాన్యమును నడపగలప్రతిప్రముఖుడును ఈ యుద్యమవ్యాప్తి తన ప్రధానధర్మములలో ఒక్కటిగా ఎంచ తగునని హెచ్చరించుచున్నాము.

గుంటూరు స్త్రీవైద్యశాలలో పనిచేయుటకు శ్రీమతి రాయసము రత్తమ్మగారు పూనికొనినట్లు తెలియవచ్చినది. స్త్రీలలో గ్రంథాలయసేవ చేయుటకు శ్రద్ధచూపినవారు ఆంధ్రదేశమున అరుదుగాఉన్నారు. శ్రీమతి రత్తమ్మగారీ ఉద్యమములో పనిచేయుట తక్కినసోదరీమణులకు ప్రోత్సాహము కలిగించుగాక!

# నెలముచ్చటలు

ఆగస్టు ౨౦ తేది; చీనాజపాను యుద్ధము : చీనా సేనలు అంతర్జాతీయ సెటిల్మెంటు తూర్పు జిల్లాలో వాంగుపూనదిసరిహద్దు చేరినవి. అందుచేత షాంగుహైలోనున్న జపాను సేనలు రెండు పాయలుగ చీలిపోవలసివచ్చినది. ౨ దినములలో చీనావారు ౫ మైళ్ళు చొచ్చుకొని పోగలిగిరి. పూసంగుదగ్గఱ ౧౨ జపాను ఓడలలో సైన్యము దిగినది. చీనాసైన్యమును హెచ్చుగా వచ్చుచున్నది.

౨౧: సేనలు ఇండియానుండి చీనాకుపోవుట: రాజప్రతినిధి భారతశాసన సభలోని వివిధపక్ష నాయకులను ఆహ్వానించి, సేనలను ఏల పంపవలసి వచ్చెనో తెలిపెను.

౨౨: సికిందరాబాదు సేనలుచీనాకు వెళ్ళినవి.

౨౩: షాంగుహైనగరవీథులలో పిరంగిగుండ్లు ప్రేలినవి. ౧౭౫ మంది మరణించిరి. ౪౭౫ గురికి గాయములు తగిలినవి. ౫౦ వేల జపానుసేన షాంగుహై చుట్టుపట్ల దిగినది. పీపింగుప్రాంతమున మరల యుద్ధారంభమైనది.

సం॥ రాష్ట్రప్రభుత్వము కోటి రూపాయల ఋణమును, మద్రాసు ప్రభుత్వము కోటిన్నర రూపాయల ఋణమును తీసికొనునట్లు ప్రకటించిరి. వడ్డీ ఏడాదికి ౧౦౦కి రు 3-0-0.

ఆంధ్రరాష్ట్ర మేర్పఱుచుటకు శాసనసభ్యులు వెంటనే ప్రయత్నింపవలెనని డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు తెలిపిరి. డాక్టరుగారు కోరినట్లు తక్కన తెనుగువారితోపాటు రాయలసీమవారును దీనికొఱకు పనిచేయవలెను.

౨౪ : పూసంగుదగ్గఱ చీనా జపాను సేనలకు ఘోరయుద్ధము జరిగినది.

౨౫: జాతీయపతాకము చెన్నపురి కార్పొరేషను భవనములపై శుభదినములలోను, సభాసమయములందును ఎత్తవలెనను తీర్మానము హెచ్చుమంది ఆమోదించిరి.

స్పెయిను యుద్ధములో తిరుగుబాటుదారులకు గెలుపు చేకూరెను.

హిందీ నిర్బంధముగ నేర్పవలెనన్న సెకండరీ పాఠశాలలలో ఇంగ్లీషుమానవలెననియు,మాతృభాషాభివృద్ధికి భాషలనుబట్టి రాష్ట్రములేర్పడుట అవసరమనియు, మా॥ బులుసు సాంబమూర్తిగారు గోఖలేహాలులో ద. భా. హిందీప్రచారసభవారేర్పాటుచేసినహిందీతరగతి ప్రారంభించునపుడు తెలిపిరి.

అండమాను ఖైదీల నిరశనవ్రతమునుగూర్చి శ్రీ సత్యమూర్తిగారు తెచ్చినతీర్మానము భారతశాసనసభలో ౬౨-౫౫ వోట్లతో నెగ్గినది. అండమాను ఖైదీలను వెంటనే భారతదేశమునకు రప్పింపవలెననుతీర్మానమును నెగ్గినది. నిరశనవ్రతము మానవలెనని కాంగ్రెస్ పక్షమువారు ఖైదీలకు తంతిపంపిరి.

చీనాజపాను యుద్ధము ఘోరముగా సాగుచున్నది.

సాలీనా సుమారు రు ౧౦,౦౦౦ ల నష్టమున కష్టపడి బొబ్బిలిరాజుగారు తమ జమీందారీలోని యీతచెట్లు కల్లుగీతకు ఇయ్యరాదని ఉత్తరువుచేసి, జిల్లాకలెక్టరుద్వారా అబ్కారీశాఖవారికి తెలిపిరి. ఇందులకు రాజుగారిని అభినందింపనగును.

౨౬ : సరిహద్దుగాంధి అగుఅబ్దుల్‌గఫూర్‌ఖాన్‌గారికి పెషావరునగరమున గొప్ప స్వాగతమొసంగిరి.

షాంగ్‌హైకు ౫౦ మైళ్ళదూరమున బ్రిటను రాయబారి మోటారులో పోవుచుండ ౨ జపానువిమానములు తుపాకులు ప్రేల్చెను. ౧ తుపాకిగుండు కుడిచంకక్రిందినుండి ఎడమవైపునకు తూటుచేసికొని పోయెను. ఆయన అపాయస్థితిలో ఉన్నాఁడు. జపాను అధికారులు ఈప్రమాదమునకు విచారము తెలిపిరి.

కాల్గను, హవాయిలి, చింగ్ హేనగరములు తమకు లోనయ్యెనని జపానువారు ప్రకటించిరి.

గాంధిశిల్మలమీఁదినిషేధమును బొంబాయి మంత్రివర్గము తొలగించెను.

౨౭ : ఉప్పు తయారు చేసికొను హక్కు గాంధి-ఇర్విన్ ఒడంబడిక ననుసరించి మరల చెన్నరాష్ట్రప్రజల కిచ్చుటకు ఇండియాప్రభుత్వము వా రంగీకరించిరి. కావున ఒడంబడిక షరతులను మీఱక నడచుకొనవలెనని ప్రకటన శాఖామంత్రిగారు ప్రజలను కోరిరి.

మద్రాసు క్రైస్తవకళాశాలావిద్యార్థిసంఘ సమావేశమున ప్రధానమంత్రిగారు భారత జాతీయతకు హిందీ అవసరమనియు, మాతృభాషను నిరాదరింపవలదనియు నొక్కి చెప్పిరి.

౨౮ : చీనాజపానుయుద్ధము : పూటంగుపై పిరంగిగుండ్లను, నాటోపై బాంబులును జపానువారు వేసిరి. పూసంగుప్రాంతమున చీనా సేనలు జపానుసేనలతో ఘోరముగా పోరుచున్నవి.

చీనాఅధ్యక్షుఁడగు చ్యియాంగుకే షేకు అనుకొని జపానువారు బ్రిటనురాయబారిపై తుపాకులు పేల్చిరని ఒక జపానుపత్రిక ప్రకటించినది.

స్పెయినుయుద్ధము :

ఆరగానుప్రాంతమున ప్రభుత్వమునకు విజయము కలిగెను. సాంటాండరురాష్ట్ర మంతయు ఫ్రాంకోకు లోఁబడినది.

క్రొత్తరాజ్యాంగవిధానమును సింధుఅసెంబ్లీవారు నిరాకరించిరి.

౨౯ : యుద్ధముతో సంబంధము లేనివారిని ఎదిరించుట అమానుషమని బ్రిటను జపానుకు సందేశ మంపెను.

చీనాను నిర్మూలింపవలెనని జపానుప్రధానమంత్రి ప్రకటించెను.

అండమానుఖైదీలు పెక్కురు నిరశనదీక్ష వదలిరి.

౫౧ వ కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గపు ఎన్నికలు బార్డోలీలో జరిగినవి. దానికిఅధ్యక్షులు దర్బారుసాహేబు గోపాల్ దాస్ దేశాయిగారు. ఉపాధ్యక్షులు - శ్రీమతి భక్తిలక్ష్మిదేశాయి, విజయగారీకనుగా, వితానే పెటిట్ మణిలాల్, చతుర్బాదుషాగార్లు. కార్యదర్శి - కన్యాలాల్ దేశాయ్‌గారు.

గుంటూరిలో బాట్లీవాలాగారి అధ్యక్షతను ఆంధ్రరాష్ట్ర విద్యార్థుల మొదటి సమావేశము జరిగెను.

౩౦ : జాతీయాభివృద్ధికి జాతీయవిద్యయే కావలె అని డాక్టరు అరండేల్ గారు తెలిపిరి. సాధారణజీవితమునువెట్లు గడపుటో తెలుపున దేజాతీయ విద్య; అది విద్యార్థుల తల్లిభాషలో నేర్పవలె.

ఒరిస్సాబడ్జెటు ప్రధానమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టెను. ఆదాయము రు ౩, ౫౫, ౧౩, ౦౦౧; వ్యయము రు ౩, ౨౭, ౭౫, ౦౦౦; మిగులు రు ౨౭, ౩౮, ౦౦౦.

ప్రత్యేకాంధ్రరాష్ట్రము త్వరలో ఏర్పఱుచుటకు చెన్నపురిశాసనసభ్యులు తీర్మానములు చేయించి, వలయుప్రయత్నములు చేయవలెనని బెజవాడపౌరులు బహిరంగసభలో తీర్మానించిరి.

చీనారష్యాదేశములు ఒడంబడిక చేసికొనినవి.

౩౧ : సర్వీసులు- క్రొత్తప్రభుత్వము. మద్రాసుగవర్నరుగారు అసెంబ్లికౌన్సిళ్ళు రెండును కలసిన సమావేశమున ఉపన్యసించుచు, ప్రభుత్వమువారి ఉత్తరువులనుబట్టి నడచుటయే ప్రభుత్వోద్యోగులధర్మ మనియు, కాంగ్రెసు మంత్రుల చర్యలు తమ నిండుసమ్మతితోనే జరిగెననియు, ప్రజాప్రభుత్వమునకు పునాదివేయు గొప్ప బాధ్యత మంత్రులమీఁద ఉన్నదనియు, అధ్యక్షునకు నిష్పాక్షికదృష్టి ఉండవలెననియు,

అన్నిపక్షములవారును అధ్యక్షునకు సమాన గౌరవ మొసఁగవలెననియు, ఈ రాష్ట్రమితర రాష్ట్రములకు ఆదర్శముగా చేయుదురని ఆసించుచున్నాననియు తెలిపిరి.

చెన్నపురి అసెంబ్లీలో ప్రధానమంత్రిగారి యీక్రిందితీర్మానము హెచ్చుమందిఆమోదించిరి.

"౧౯౩౫ ఇండియా ప్రభుత్వ శాసనము వీలగునంత త్వరలో తొలఁగించి, దానికిమాఱు భారతదేశమహాసభవారి తీర్మానమందలి భారతీయుల కోరికలకు తగిన రాజ్యాంగవిధానము అమలుపఱుపవలె ననియు, ఈ రాష్ట్రమందు కాంగ్రెసువారు మంత్రిత్వము కైకొనుటచే భారతప్రజాప్రతినిధుల సభను జరపి, అందు రాజ్యాంగవిధానము నిర్ణయింపవలెనను కోరిక వదలుకొన్నట్లు ఎన్నరాదనియు తలంచు ఈసభవారి దృఢవిశ్వాసమును ఇండియా ప్రభుత్వము వారికిని బ్రిటిష్ ప్రభుత్వమువారికిని తెలుపవలెనని స్థానికప్రభుత్వమువారిని కోరనైనది."

పూసంగుపట్టణము జపానువారికి లోబడినట్లు చీనావా రంగీకరించిరి. నాంకింగు నగరమును చీనావారు ఖాళీచేసి పోవుచున్నారు. కాంటనునగరముమీఁదికి జపానువిమానములు వచ్చి, చైనావారి విమానాశ్రయముమీఁద రెండుబాంబులు వేసె; చీనా విమానములు వానిని తఱిమెను.

సికందరాబాదులోని రాజపుతానాపటాలము చీనాకు బయలుదేఱెను.

సెప్టెంబరు ౧: రైతుదినోత్సవసభలు పలుచోట్ల జరిగెను. చెన్నపురి అసెంబ్లీలో కాంగ్రెస్ మంత్రివర్గమువారి మొదటి బడ్జెటును శ్రీ రాజగోపాలాచార్యులుగారు ప్రవేశపెట్టిరి. ౧౯౩౭-౩౮ అంచనారాబడి రు ౧౫, ౯౩, ౭౩,౦౦౦; వెచ్చము రు ౧౫, ౯౩, ౬౭, ౦౦౦; నిలువ రు ౬,౦౧౦; సేలముజిల్లాలో మద్యనిషేధమువలన రు ౧౩ లక్షలు నష్టము; రెమిషను రు ౭౫,౦౦,౦౦౦; ఖైదీల మజ్జిగకు రు ౭౫ వేలు; ఖద్దరుకు రు ౨ లక్షలు, క్రొత్త నీటిపాఱుదలస్కీములకు ఎలక్ట్రిక్ స్కీములకు పరిశ్రమలస్కీములకు రు ౧౬౨ లక్షలు; రైతులకు అప్పులిచ్చుటకు రు౩౭ లక్షలు; స్థానికసంస్థలకు రు ౩౦ లక్షలు; కో-ఆపరేటివు బిల్డింగ్ సేల్‌సొసైటీలకు రు ౫ లక్షలు.

నిరుటికంటె ఈఏఁడు నీటిపాఱుదలకు రు ౫౪ లక్షలు, విద్యకు రు ౨౪ లక్షలు, వైద్యసాహాయ్యమునకు రు ౮౪ లక్షలు, ఆరోగ్యమునకు రు ౯౪ లక్షలు, వ్యవసాయమునకు రు ౧౪ లక్షలు, పశువైద్యమునకు రు ౭౫ వేలు, సహకారమునకు రు ౨౪ లక్షలు, పరిశ్రమలకు రు ౫ లక్షలు హెచ్చుగ్రాంటు వచ్చినది. రైతులఋణభారము తగ్గించుటకు గ్రాంటు రు ౩౦ లక్షలు.

షాంగుహేలో జపానువారు తీవ్రముగా బాంబులు ప్రయోగించిరి.

చీనావారు ౫౦ కోట్ల డాలర్లు అప్పుగా తీసికొన నిశ్చయించిరి.

టోకియోలోని చీనారాయబారి జపాను ప్రధానమంత్రితో రష్యాతో ఒడంబడికచేసికొన్నట్లే జపానుతోకూడ సంధిచేసికొనుటకు సిద్ధముగా ఉన్నట్లు తెలిపెను.

౨: సంఘరాష్ట్రముల అసెంబ్లీ బడ్జెట్టు సమావేశము ఉదయమున ప్రారంభ మయ్యెను.

ఒరిస్సా ప్రభుత్వమువారు ఈయేఁడు రు ౮౧ వేలు లోటుగాని రు ౨౭ లక్షలు మిగులులేదని ప్రకటించిరి.

౩: రాష్ట్రముల సాయమునకై భారతప్రభుత్వవ్యయము తగ్గింపవలెనను శాంతసింగుగారితీర్మానము సిమ్లా అసెంబ్లీలో నెగ్గినది.

కార్యనిర్వాహక న్యాయవిచారణ శాఖలను విడఁదీయవలెనను తీర్మానము బీహారు అసెంబ్లీవా రామోదించిరి.

ప్రభుత్వోద్యోగులు ఖద్దరుదుస్తులు వాడ

వలెనను శ్రీమతి లక్ష్మీబాయిగారి తీర్మానము ఒరిస్సాఅసెంబ్లీవారుఏకగ్రీవముగాఆమోదించిరి.

ఉప్పు చేసికొను సౌకర్యములు సొంతవాడుకకే కాని ఊరుదాటి పైని అమ్ముకొనుటకు వాడరాదని మద్రాసు ప్రకటనశాఖామంత్రిగారు ప్రకటించిరి. కావున కావలసినదానికంటె ఎక్కువగా తయారుచేసి, ఇచ్చిన సౌకర్యమును పోగొట్టుకొనక బీదలు మేలు పొందెదరుగాక! మదరాసు అసెంబ్లీ మందిరమున ఒక వృద్ధస్త్రీ నూలువడికి చూపినది.

పాంగుహేదగ్గఱ ఘోరయుద్ధము జరిగినది. రెండువైపులను హెచ్చుమందిచనిపోయిరి. పట్టుపడుటకు ఒల్లక ఒక జపానుసేనానియు ౫౦మంది యోధులును హరకిరి (ఆత్మహత్య) చేసికొనిరి.

దక్షిణచీనాలో యామాయిదగ్గఱ కూడ యుద్ధము ప్రారంభమైనది.

సరిహద్దురాష్ట్రమండలిఅసెంబ్లీలో మంత్రులపై విశ్వాసము లేదను తీర్మానము ౨౭-౨౨ మంది ఆమోదించుటచే మంత్రులు రాజీనామా ఇచ్చిరి. గవర్నరుగారు ఖానుసాహెబుగారిని ఆహ్వానించిరి.

౭ : ఖానుసాహెబుగారు గవర్నరుగారితో మాటలాడిరి. చెన్నపురిఅసెంబ్లీబడ్జెట్టుపై చర్చ జరిగినది.

ఆంధ్రరాష్ట్ర హరిజన సేవాసంఘమునకు ౫ఏండ్లనుండి అధ్యక్షులుగానున్న శ్రీకాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు జబ్బుగా నుండి రాజీనామా పెట్టుటచే మా॥ వేమవరపురామదాసుపంతులుగారిని అధ్యక్షులుగా ఎన్నుకొనిరి.

అండమానుఖైదీలు హింసాపద్ధతులను నిస్సందేహముగా ఖండించుటచే వారిని విడుదలచేయవలెనని కోరుచు గాంధీజీ బంగాళదేశ ప్రధానమంత్రికి తంతివార్త పంపెను.

మంచూకోజపానుపటాలము చీనాపక్షమున చేరినది. పాంగుహేదగ్గఱ ౧,౫౦,౦౦౦ చీనా సైన్యము కూడినది. జపానువారిబాంబులవలన చుంగ్షూపట్టణమున 3,౦౦౦ మంది పౌరులు మరణించినట్లు తెలియవచ్చినది.

౫: చిన్‌వాగ్దారోనుండి పాక్‌హైవఱకును చీనా సముద్రతీరమున చీనాస్టీమరు లేవికన్పించినను అడ్డవలెనని జపాను నౌకాదళపు వైస్‌అడ్మిరలు ప్రకటించెను.

గాంధీమహాత్ముఁడు మిక్కిలి నీరసముగా ఉన్నాఁడు. కావున ఆయనకు ఎవరును ఉత్తరములు వ్రాయరాదనియు, సయిగానుకు రారాదనియు, సేటుజమునాలుగారు ప్రకటించిరి.

చెన్నపురిత్యాగరాయనగరులో హిందీ ప్రచారభవనమున జరగిన ఉపాధ్యాయుల సభలో ప్రధానమంత్రిగారు, పాఠశాలలలో మాతృభాషకు మొదటిస్థానమును, హిందీభాషకు రెండవస్థానమును ఒసఁగుట ఉచితమనియు, I, II, III ఫారములలో హిందీభాష బోధించుట అవసరమని అనుభవజ్ఞులనేకు లిచ్చినసలహానుబట్టి తాము నిర్ణయించికొంటిమనియు చెప్పిరి.

౬ : ఒరిస్సా శాసనసభలో కార్యక్రమము ఓఢ్రమున జరగినది.

పాంగుహేదగ్గర జపానువారు భయంకరముగా మార్కొనినను, చీనావారు అద్భుతపరాక్రమముతో వారినినిలువరించిరి. మహాయుద్ధము ఇంకను ప్రారంభముకాలేదని జపానువా రనుచున్నారు. పూసంగుకోట జపానువారికి లోఁబడెననియు, వారికి లోఁబడినపోసానును తిరిగి తాము స్వాధీనపఱచుకొంటిమనియు చీనావారు తెలుపుచున్నారు. పూసంగు దగ్గఱనున్న జపానుయుద్ధనౌకలపై చీనావిమానములు బాంబులువేసెను. షేక్వానురేవుపట్టణముపై జపానునౌక బాంబులు కురిసె.

రాజపుతానా రైఫిల్సుపటాలము హాంకాంగు

చేరెను. రష్యావారు ముంచివేయఁబడిన తమ నావలకు నష్టపరిహారము మీయవలెనని ఇటలీ వారికి సందేశమంపిరి.

౭: ఒరిస్సాశాసనసభలో బడ్జెట్టుపై చర్చ ప్రారంభమైనది. సరిహద్దు రాష్ట్రమున కాంగ్రెసు మంత్రులు రాజభక్తి ప్రమాణముచేసి, పనిలో ప్రవేశించిరి. డాక్టరు ఖాను సాహెబు గారు ప్రధానమంత్రి.

౧౦: మ. రాష్ట్ర. బడ్జెట్టులో రు ౩౧ వేలు మిగులును.

౫౦౦ మంది చీనాస్త్రీలు పురుషులతోపాటు పోరాడిరి. చీనాయుద్ధము ఈయేఁడు ముగియునది కాదని జపాను ప్రధానమంత్రి తెలిపెను.

౧౧: జమీందారు రైతు సమస్యలనుగూర్చి విచారించుటకు శాసనసభ్యులసంఘము మేర్పరుపవలెనని మా॥ ప్రకాశంపంతులుగారు తెచ్చిన తీర్మానము చెన్నపురికౌన్సిలువా రంగీకరించిరి; మంత్రుల జీతముల చట్టమును అంగీకరించిరి. అండమానులలోని మదాసు రాజకీయఖైదీలను ౭ గురిని మదాసురాష్ట్రమునకు పంప, ఇండియాప్రభుత్వమువా రంగీకరించినట్లు తెలియవచ్చినది.

౧౨: చిత్తూరిలో ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సభ జరిగినది. అందు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమునుగూర్చి ప్రయత్నింపవలెనని తీర్మానించిరి.

జాతిసమితికి చీనాప్రభుత్వము విజ్ఞప్తి పంపినది.

౧౩: కృష్ణాజిల్లాబోర్డువారు తమ భవనము మీఁద జాతీయపతాకము ఎగురవేయుటకును, జవానులకు ఖద్దరుదుస్తు లిచ్చుటకును తీర్మానించిరి.

౧౪: చీనాజపాను మహాయుద్ధము ౫౦ మైళ్ళ పొడుగున ప్రారంభమైనది. చీనాపటాలములకు ఆయువుపట్టగు కూలాన్ జపానువారికి లోఁబడినది. మంత్రివర్గమునకు మదాసు కార్పొరేషనువారు సన్మాన మిచ్చిరి. తమభవనముపై మొదటిసారి జాతీయపతాకము ప్రతిష్ఠించిరి.

౧౬: చీనాలోని రైలుదారులు జపానువారి వశమగుచున్నవి.

తోడివారితో మానని ౮ గురు అండమాను ఖైదీలుకూడ నిరశనవ్రతము మానివేసిరి. ౬౫ మందిని అక్కడనుండి ఇండియాకు పంపిరి.

హెచ్చుమంది వలదని కోరుటచే లాహోరు కంటోన్మెంటులో కమేలా కట్టుప్రయత్నము మానివేసినట్లు రాజప్రతినిధి ప్రకటించెను.

౧౭: ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకించుటను గూర్చి అసెంబ్లీలో ఆలీబేగ్‌గారు మాటలాడిరి.

౧౮: ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకించుటను గూర్చి అక్రమాలీగారు ముచ్చటించిరి. రాజగోపాలాచార్యులుగారు బడ్జటుచర్చలో అది అప్రస్తుతమనియు, దానినిగూర్చి ప్రత్యేకముగ తీర్మానముగానో మఱొకవిధముననో చర్చకు తేవచ్చుననియు జవాబుచెప్పిరి.

లాకాలేజీలో ఉపన్యసించుచు మా॥ వీ. వీ. గిరిగారు, యువకులు దేశసేవ చేయుటకు పూనుకొనవలెననియు, ౧౦ ఊళ్ళకు ఒకరు చొప్పున జాతీయభావములు ప్రజలకు బోధింపవలయుననియు, అటు చేసినవారికి ప్రజలు తోడ్పడుదురనియు, అటుల నిరుద్యోగసమస్య కొంత తీరుననియు, మద్యనిషేధ ప్రచారమున పని చేయవలెననియు తెలిపిరి.

బొంబాయి రాష్ట్రపు క్రొత్త గవర్నరు సర్ రోజర్ లూమ్లీగారు తమఉద్యోగములో ప్రవేశించిరి.

# ఏలూరు అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఈ సంఘము రిజష్టరైనది.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య, విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్ల చలివేంద్రిలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

శాశ్వతధర్మకర్తలలోనివారు :— రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, కొత్తమాసు సీతారామయ్యగారు, (పోల్‌ట్రిస్టీలు) పసుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు) మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) కందుల రామయ్యగారు (సెక్రిటరీ).

---

# ఏలూరు, హిందూ యువజనసంఘము
## Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రమున సంఘమురిజష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందు తీర్ణులకు బహుమతు లొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసినవి యున్నవి. ఎలక్‌ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కాన ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను, శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి).

42

# Ellore Gosamrakshana Samithi.

## ఏలూరు గోసంరక్షణసమితి స్థాపితము 1918.

ది 22-9-36 న ఈ సంఘము రెజిస్టరయినది.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బీదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డినిమిత్తము బీడుభూమి కొనవలసియున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదు గురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [ రు 500 దాతలు ] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షికమామూళ్లుగను, నెలచందాలుగను వరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితిఅభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

ఏలూరు }
రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, ( ప్రెసిడెంటు, ట్రస్టి. )
మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, ( వైస్ ప్రెసిడెంటు, ట్రస్టి. )
పోలిశెట్టి గోపాలస్వామిగారు, ( సెక్రిటరి, ట్రస్టి. )


వృద్ధాప్యమునందు మీకుగాని, తదనంతరము మీ యార్జనాసౌకర్యములను గోల్పోయిన మీ దారాపుత్రాదులకుగాని, సునాయాసము, సుఖప్రదమునగు జీవితము నేర్పరచునదియు, మిక్కిలిగ ఆధారపడతగినదియునగు పెట్టుబడి

"ప్రాణ భీమా"

గనుక, వెంటనే మీ జీవితములను 'ఓరియంటల్' కంపెనీలో భీమా చేయించి, మీకును, మీ యనుజీవులకును భవిష్యత్తు నేర్పరచుకొనుడు:—

వివరములకు:— **ది ఓరియంటల్**

**గవర్నమెంటు సెక్యూరిటీ లైఫ్ ఎష్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.**

స్థాపితము 1874 — లేక — హెడ్ ఆఫీసు, బొంబాయి

బ్రాంచి సెక్రిటరీ, ఉత్తరసర్కార్లు, గొడేవారివీధి, విశాఖపట్నము లేక

కంపెనీతాలూకు దిగువ నే ఆఫీసున కయినను వ్రాయుడు—

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాదు, అంబాల, అమృతసార్, బెంగులూర్, బెరిమేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్. కోయంబత్తూరు, కొలంబో, ఢక్కా, ఢిల్లీ, గౌహతీ, గుంటూరు, జల్గాను, జల్పాయగురి, జోద్పూర్, జబ్బల్పూరు, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మద్రాస్, మాండలీ, మధుర, మెర్కారా, మొంబాసా, ముల్తాన్, మైసూరు, నాగపూరు, పాట్నా, పెషావరు, పూనా, రాయపూర్, రాజషాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూరు, సుక్కూర్, తిరుచునాపల్లి, ట్రివేండ్రము, వెల్లూరు.

విలువ పెరుగుచున్నది.

1936 వ సంవత్సరంలో రు 10,26,30,496 ల కిమ్మతుగల 59,296 పాలసీలు.

1935 వ సంవత్సరంలో రు 8,89,89,149 ల కిమ్మతుగల 48,858 పాలసీలు.

పెంపుదల: పాలిసీలు 7,438; కిమ్మతు 1,36,41,347.


బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడినది.

| | |
|---|---|
| | **మనసు ఫౌండేషన్**<br>**పుస్తకాల పరిశీలనాపట్టిక** |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A 170 |
| **పుస్తకం పేరు** | [illegible] |
| **తారీఖు** | 7/6/20 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| **మొత్తం పేజీలు** | 45 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| **ఖాళీ పేజీలు** | NO |
| లేని పేజీలు | NO |
| **తయారు చేసినది** | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |